ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	65,842	1,09,871
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.33 (4.02)	4,365	4,365
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.963 (42.6707)	76,373	1,12,536

చికెన్ ధరలు | లైవ్ : రూ.117 | డ్రెస్ : రూ.170 | స్కిన్‌లెస్ : రూ.196

బోనమెత్తిన జిల్లా



జిల్లావ్యాప్తంగా బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన బోనాలను మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి, గ్రామదేవతలకు నైవేద్య సమర్పించారు. 8

రద్దీగా మారిన హైవే



వరుస సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణంలో 65వ నెంబర్ జాతీయ రహదారి పై రద్దీ కొనసాగింది. వాహనాలు బారులు తీరడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అయింది. 7

భక్తజన సంద్రం..



యాదగిరీశుడి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దేవదేవుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లు రద్దీగా కనిపించాయి. 7

మిగిలింది 4రోజులే

- 'భూభారతి' దరఖాస్తుల పరిష్కారానికి సమీపిస్తున్న గడువు
- వేలల్లో దరఖాస్తులుండగా పరిష్కారమైంది వందల్లోనే
- చిక్కుముడులున్న అర్జీలే ఎక్కువగా ఉండటంతో ముందుకు కదలని ఫైళ్లు
- క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఆటంకాలు
- నల్లగొండ జిల్లాలో గడువునాటికి సగం పూర్తి కూడా కష్టమే
- సాదాబైనామాలు, పీవోటీలు, కోర్టు కేసుల వల్లే పెండింగ్



భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

జిల్లా	దరఖాస్తులు
నల్లగొండ	43636
యాదాద్రి	14,328
సూర్యాపేట	44,741
మొత్తం	1,02,705

భూముల చిక్కులన్నీ పరిష్కరించే నిమిత్తం ప్రభుత్వం తీసుకువచ్చిన 'భూభారతి' అమలుకు క్షేత్రస్థాయిలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. గ్రామాలవారీగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 15లోగా వంద శాతం పరిష్కరించాలనే లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 'భూభారతి' సదస్సుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతీ రెవెన్యూ గ్రామం నుంచి భూ సమస్యలపై అర్జీలు వచ్చాయి. వీటన్నింటినీ క్రోడీకరించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కరించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నా ఇంకా వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నిర్ణీత గడువులోగా దరఖాస్తులన్నీ పరిష్కరించడం అసాధ్యంగా కనిపిస్తోందని రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

భూభారతి అమలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 1,02,705 దరఖాస్తులు రాగా, వాటి ప్రకారం డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, ఇతర రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అంతేగాక భూములను సందర్శించి అవసరమైన చోట్ల హద్దురాళ్లు నిర్ణయించడంతోపాటు అక్కడికక్కడే మ్యాప్‌లు రూపొందిస్తున్నారు.

ప్రధానంగా కుటుంబ వివాదాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, కబ్జా భూముల సమస్యలు, రికార్డుల్లో ఒకరి పేరుంటే, మోకాపై మరొకరు ఉండడం, రికార్డుల్లో పేర్లు తారుమారు, బై నెంబర్లు లేకపోవడం, అసైన్డ్ పట్టాలున్న సర్వేనెంబర్లలో డూప్లికేషన్ పెద్ద సంఖ్యలో ఉండడం, అటవీభూముల్లోనూ రెవెన్యూ భూములున్నాయని రైతులు చెబుతుండగా, వాటిని అటవీ భూములుగా ఆ శాఖ అధికారులు రికార్డులు సమర్పిస్తుండడం వంటి సమస్యలు క్షేత్రస్థాయి సర్వేల్లో వెలుగులోకి వస్తున్నాయి. వీటితో పాటు ప్రధానంగా పీవోటీలు, సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లపై ఎటూ తేల్చలేని పరిస్థితి క్షేత్రస్థాయిలో అధికారులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండగా, గడువు తరుముకొస్తుండడంతో ఈలోగా వందశాతం దరఖాస్తుల పరిశీలన పూర్తికా

మిగతా 7వ పేజీలో...

సాదాబైనామాలపై ఆశలు

పంద్రాగస్టు సందర్భంగానైనా సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే ఆశాభావం రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల కాలంగా పెద్ద సంఖ్యలో సాదాబైనామా క్రయవిక్రయాలు కొనసాగాయి. గత ప్రభుత్వ హయాంలో 2014కు ముందు ఉన్న సాదాబైనామాలన్నింటికీ మోక్షం కల్పించాలని నిర్ణయించి 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు అందుకు గడువు ఇచ్చారు. ఈ నిర్ణీత వ్యవధిలో మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం పేర్కొనడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక సాదాబైనామాల ప్రస్తావన లేకపోవడంతో ఆ దరఖాస్తులన్నీ మూలనపడ్డాయి. తాజాగా భూభారతిలో సెక్షన్-6 ప్రకారం 2020లో మీ-సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించడంతో, ఆతర్వాత లావాదేవీలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొని 2023 వరకు ఉన్న సాదాబైనామాలకు అనుమతించాలని రైతులు కోరుతున్నారు. అయితే ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మాత్రం సాదాబైనామాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ ఉన్న భూయజమానులంతా తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో 6,793 దరఖాస్తులు రాగా, యాదాద్రి జిల్లాలో 3,458, సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 15,678 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో సాదాబైనామాలవే సింహభాగం ఉండగా, సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేయాల్సిన ఆవశ్యకతను తెలుపుతోంది. అయితే సాదాబైనామాలపై హైకోర్టులోనూ కేసు పెండింగ్‌లో ఉండడంతో ఆ తీర్పు వచ్చేంతవరకు వేచి ఉండి దానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, అప్పటివరకు వేచి ఉండక తప్పదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు

పొడిగింపేనా?



- 14తో ముగుస్తున్న పాలకవర్గాల పదవీ కాలం
- పీఏసీఎస్‌లకు ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ అసాధ్యమే!
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్న ప్రభుత్వం

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)తో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గం గడువు ఈనెల 14తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? లేక మరోసారి పాలకవర్గాల గడువును పొడగిస్తారా? అని చర్చ కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో పీఏసీఎస్‌లతోపాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు పాలకవర్గాల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువు సైతం ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 108 సహకార సంఘాలు ఉన్నాయి. ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్లు, రాష్ట్ర టెస్కాబ్ పాలకవర్గం సైతం ఇప్పటికే మంత్రులను కలిసి గడువు పొడిగించాలని కోరినట్లు తెలిసింది. అంతేగాక దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్లు కలిసేందుకు నిర్ణయించారు. సీఎం సమయం కేటాయిస్తే ఆయన్ను కలిసి గడువు పొడిగింపుపై వినతి పత్రం సమర్పించనున్నారు. ఆరు నెలల క్రితం పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు ముగియక ముందే సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్లు కలిశారు. సొసైటీలు, సహకార బ్యాంకుల అభివృద్ధి కోసం మరికొంత

మిగతా 7వ పేజీలో...

మళ్లీ తెరుచుకున్న సాగర్ క్రస్ట్‌గేట్లు



నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకుంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ఆదివారం ఎనిమిది క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సీజన్‌లో క్రస్ట్‌గేట్లను ఎత్తడం ఇది రెండోసారి. • 7లో

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి


నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసీయూ, సర్జికల్, మెడికల్ వార్డులు, రేడియాలజీ, తదితర విభాగాలను తనిఖీ చేసి వైద్యులు, నర్సులతో మాట్లాడారు. ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంత మంది రోగులు ఉన్నారు. ఎన్ని పడకలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వస్తున్న వారి వివరాలపై ఆరా తీశారు. రేడియాలజీ విభాగం దూరంగా ఉన్నందున నడవలేని రోగులకు మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ద్వారా ఎక్స్‌రే తీయిస్తున్నామని, నడవగలిగే వారిని వీల్ చైర్ ద్వారా రేడియాలజీ విభాగాని తీసుకెళ్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పతిరలో అవసరమైన అన్ని వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులతో ఎక్కువ మంది ఆస్పత్రికి వస్తున్నారని, వారికి తగిన వైద్య చికిత్సలు అందించాలన్నారు. మందులు ఇతర ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు చేయాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్, ఆర్ఎంవో కిరణ్ కుమార్, టీఎస్ఎంఐడీసీ రాజశేఖర్, జితేందర్, తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నులిపేద్దాం

నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



చిన్నారులు ఎదిగేందుకు అడ్డుపడుతున్న నులిపురుగల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నేటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది. 7

ఆదిపరాశక్తిగా.. ఎల్లమ్మ తల్లి



పూజల్లో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఆదిపరాశక్తి అలంకారంలో అమ్మవారు

కనగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీవద్దగల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రావణ మాసం మూడో ఆదివారం పురస్కరించుకుని భక్తులకు ఆదిపరాశక్తిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లాచారి, శ్రవణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి లక్ష్మీ అష్టోత్తర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. చీరు, సారె, ఒడిబియ్యం, నైవేద్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దోస్త్ స్పాట్ అడ్మిషన్లల్లో అనుమతి ఇవ్వాలి

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దోస్త్ స్పాట్ అడ్మిషన్లల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.గోపి, కడారు సురేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకరి రాజారాం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ పథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందే వారికి ఇప్పటివరకు మూడు విడతలలో దోస్త్ ద్వారా పూర్తి చేశారని తెలిపారు. ప్రత్యేక విడత ముగిసే దశలో ఉందన్నారు. అయితే ఉన్నత విద్యామండలి ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ప్రైవేట్ కళాశాలలకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. వృత్తిరీత్యా ప్రైవేట్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేసే వారు, వివిధ కారణాలతో ఇత రాష్ట్రాల్లో పనిచేసే కుటుంబాల పిల్లలు, ఆయా రాష్ట్రాల్లో చదివినందున వారిని నాన్ లోకల్‌గా పరిగణించి దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో అనుమతించడం లేదన్నారు. ప్రతీ విద్యార్థికి డిగ్రీ కళాశాలలో చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో మిగిలిపోయిన సీట్లు ఉన్న కళాశాలలో బయటి రాష్ట్రాల్లో చదువుకున్న విద్యార్థులకు ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అనుమతించాలని తెలిపారు.

రేపు జిల్లాలో రేజాంగ్ల రజ్ కలశ యాత్ర

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 12వ తేదీన రేజాంగ్ల రజ్ కలశ యాత్రను నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. 1962 సంవత్సరంలో రేజాంగ్ల అనే ప్రాంతంలో ఇండియా, చైనాల మధ్య జరిగిన యుద్ధంలో 1300 మందిని హతమార్చారన్నారు. 120 మంది యాదవ యుద్ధవీరులు వీరమరణం పొందారని, ఈ వీరులకు గుర్తింపుగా యాదవ రెజిమెంట్ ప్రకటించాలని అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ రేజాంగ్ల రజ్ కలశ యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు దేవరకొండ, మధ్యాహ్నం 12గంటలకు కొండమల్లేపల్లి, ఒంటిగంటకు గుర్రంపోడు, 2 గంటలకు కనగల్, మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

గుట్ట ఆలయ భద్రతకు పెద్దపీట



- దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావ్ 7

సామర్థ్యాలు.. అత్తెసరే



ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిలిపేందుకు ప్రభుత్వం మౌలిక వసతుల కల్పనకు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. అన్నివిభాగాల్లో శిక్షణ ఉపాధ్యాయులు ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతోంది. అయితే విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు కనిపించడం లేదు. ఇటీవల నిర్వహించిన కనీస సామర్థ్యాల గుర్తింపు పరీక్షల్లో తెలుగు, ఆంగ్లం, గణితంలో విద్యార్థులు వెనుకంజలో ఉన్నారు. తెలుగులో రాయగలిగేవారు 25 శాతం మాత్రమే ఉండగా, ఆరవ తరగతి నుంచి 9వ తరగతి విద్యార్థుల్లో గణితంలో బాగాహారాలు చేసేవారూ సైతం 25 శాతం దాటకపోవడం గమనార్హం.

- (ఆంధ్రజ్యోతి-సూర్యాపేట(కలెక్టరేట్)

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలను కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ తనిఖీలు చేసి విద్యార్థుల్లో సామర్థ్యాలను పరిశీలిస్తున్నారు. చాలామంది విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు విద్యలో వెనుకబడిపోతున్నారని కలెక్టర్ గుర్తించారు. దీంతో జిల్లాలోని అన్ని తరగతుల విద్యార్థులకు కనీస సామర్థ్యాలు ఉండాలని అందుకోసం ఉపాధ్యాయులు ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచించారు. అదేవిధంగా ఈ నెల 15వ తేదీ వరకు విద్యార్థులు చదవడం, రాయడం రావాలని ఆ దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలని ఆదేశించారు. దీంతో పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థులకు ప్రత్యేక బోధన చేస్తున్నారు.

మూడు సబ్జెక్టులపై పరీక్ష..

ఈ ఏడాది జూన్‌లో జిల్లాలోని 23 మండలాల పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు కనీస సామర్థ్య గుర్తింపు పరీక్ష నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఈ పరీక్షలను నిర్వహించారు. ఒకటో తరగతి నుంచి ఐదవ తరగతి వరకు చదివే 16,528 మంది విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్, గణితం సబ్జెక్టులకు సంబంధించి కనీస సామర్థ్యాల గుర్తింపు పరీక్షను నిర్వహించారు. అందులో తెలుగులో స్పష్టంగా చదువుతున్న వారు కేవలం 5,291 మంది ఉండగా, రాయగలిగేవారు 3,072 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ఆంగ్లంలో స్పష్టంగా చదవగలిగేవారు 4,121 మంది, రాయగలిగేవారు 2,662 మంది మాత్రమే ఉండటం గమనార్హం.

ఆరో తరగతి నుంచి తొమ్మిదో తరగతి వరకు

జిల్లాలో 14,544 మంది విద్యార్థులకు కనీస సామర్థ్యాల గుర్తింపు పరీక్షను నిర్వహించారు. తెలుగులో స్పష్టంగా చదివేవారు6,225 మంది ఉండగా, రాయగలిగేవారు 3,287 మంది. ఇంగ్లీష్ రా యగలిగేవారు 20 శాతం మాత్రమే ఉన్నారు. గణితంలో బాగాహారాలు చేసే వారు 4,759 మంది ఉన్నారు.

పూర్వజ్ఞానం విషయంలోనూ..

గణితంలో పూర్వజ్ఞానం కలిగిన వారు 2,180మంది, సాధించాల్సిన లక్ష్యాలను చేరుకున్న వారు 991మంది ఉన్నట్లు గుర్తించారు. జనరల్ సైన్స్ సబ్జెక్టులో మామూలుగా చదివే వారు 3,790మంది, పూర్వజ్ఞానం కలిగిన వారు 1,948 మంది, సాధించాల్సిన లక్ష్యాలను చేరుకున్న వారు 1,153మంది విద్యార్థులు ఉన్నారు. భౌతికశాస్త్రంలో మామూలుగా చదివేవారు 4,842 మంది, పూర్వజ్ఞానం కలిగిన వారు 2,045 మంది, సాధించాల్సిన లక్ష్యాలను చేరుకున్న వారు 1,071 మంది విద్యార్థులు ఉన్నారు. బయోలాజికల్ సబ్జెక్టుకు సంబంధించి మామూలుగా చదివేవారు 4,333 మంది, పూర్వజ్ఞానం కలిగిన వారు 2,664 మంది, సాధించాల్సిన లక్ష్యాలను చేరుకున్న వారు 1,628 మంది విద్యార్థులు ఉన్నారు. సాంఘిక శాస్త్రం సబ్జెక్టులో మా మూలుగా చదివేవారు 8,700 మంది, పూర్వజ్ఞా నం కలిగిన వారు 4,506 మంది, సాధించాల్సిన లక్ష్యాలు చేరుకున్న విద్యార్థులు 1,999 మంది ఉన్నట్లు ఉపాధ్యాయులు గుర్తించారు. పలు విభాగాల్లో వెనుకబడిన విద్యార్థులకు కనీస సామర్థ్య గుర్తింపు పరీక్ష ఆధారంగా వారిపై.. ప్రత్యేక శ్రద్ధ తీసుకుని వారిలో విద్యా నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

కనీస సామర్థ్యాలు పెరిగేనా

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసించే విద్యార్థుల్లో కనీస సామర్థ్యాలు పెరిగేందుకు ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. ప్రతి ఏడాది ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ల సంఖ్య పెరిగేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అడ్మిషన్లు పెరగాలంటే విద్యా ర్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాల్సి ఉంది. అందుకోసం పాఠశాలల్లో విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు కొంతమేర కనీస సామర్థ్యాలు సాధించగలుగుతున్నారు.

కనీస సామర్థ్యాల పరీక్ష 1వ తరగతి నుంచి ఐదో తరగతి వరకు

సబ్జెక్ట్	చదవడం	స్పష్టంగాచదవడం		రాయడం
తెలుగు	8,537	5291		3072
ఆంగ్లం	8001	4121		2662
గణితం	కూడికలు	తీసివేతలు	గుణకారాలు	బాగాహారాలు
	11,369	8084	3960	1699

» జూన్‌లో కనీస సామర్థ్యాల గుర్తింపు పరీక్ష

» ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు పరీక్షలు



తెలుగు సబ్జెక్టులో...			
స్పష్టంగా చదివేవారు	మామూలుగా	రాయగలిగే వారు	
6225	7761	3287	
ఇంగ్లీష్ సబ్జెక్టులో ...			
స్పష్టంగా చదివేవారు	మామూలుగా	రాయగలిగేవారు	మాట్లాడేవారు
6462	5257	2993	2993
హిందీ సబ్జెక్టులో ...			
స్పష్టంగా చదివేవారు	మామూలుగా	రాయగలిగేవారు	మాట్లాడేవారు
5010	5080	2280	4501
గణితం సబ్జెక్టులో...			
కూడికలు చేసేవారు	తీసివేతలు	గుణకారాలు	బాగాహారాలు
11260	8285	6078	4759

ప్రతి విద్యార్థిపై దృష్టి సారిస్తున్నాం



విద్యాభ్యాసంలో వెనుకబడిన ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ప్రతీ విద్యార్థికి కనీస సామర్థ్యాలు కలిగి ఉండేలా విద్యాబోధన చేస్తున్నాం. విద్యలో వెనుకబడిన వారిని గుర్తించి వారిని గ్రూపులుగా విభజించి వారికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేస్తూ విద్యార్థులు ప్రతిభ కనబరిచేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్‌కు దీటుగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నాం.

అశోక్‌కుమార్, డీఈవో, సూర్యాపేట జిల్లా

గంజాయి విక్రయదారుడి రిమాండ్



గంజాయి విక్రయదారుడిని అరెస్ట్ చేసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ శంకర్

తిప్పర్తి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : గంజాయి విక్రయిస్తున్న వారిపై నల్లగొండ జిల్లా తిప్పర్తి పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్ఐ శంకర్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని కేశరాజుపల్లి గ్రామ శివారులో అదే గ్రామానికి చెందిన మేడిశెట్టి పరుశురాములు, నల్లగొండ పట్టణం బీటీఎస్‌కు చెందిన మహమ్మద్ షఫీ గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో శనివారం మధ్యాహ్నం పోలీస్ బృందంతో దాడి చేసి సుమారు రూ.50 వేల విలువైన రూ.2 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు మేడిశెట్టి పరుశురాములను అదుపులోకి తీసుకోగా మరో నిందితుడు పరారీలో ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. ఇరువురిపై కేసు నమోదు చేసి అదుపులో ఉన్న నిందితుడిని రిమాండ్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అదేవిధంగా వీరు హైదరాబాద్‌లోని దూల్‌పేట్ నుంచి గంజాయిని తెచ్చి చిన్నచిన్న ప్యాకెట్లలో ఈ ప్రాంతంలో విక్రయిస్తున్నట్లు విచారణలో తేలినట్లు ఎస్ఐ అన్నారు.

నిబంధనల మేరకు విక్రయాలు జరపాలి

కోదాడ రూరల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నిబంధనల మేరకు మాంసం విక్రయ వ్యాపారులు నడుచుకోవాలని కోదాడ ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ పెంటయ్య అన్నారు. సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ ఆదేశాల మేరకు ఆదివారం కోదాడ పట్టణంలో మాంసం దుకాణాలను తనిఖీ చేసినట్లు తెలిపారు. పట్టణ కబేళాల్లో పశువుల వద్ద నిబంధనల అమలు, పరిశుభ్రమైన దుకాణాల్లో, ఆరోగ్య మాంసం విక్రయాలు, ప్రజారోగ్యంపై ప్రభావం తదితర అంశాలపై మునిసిపల్ సానిటరీ అధికారులు, జవాన్‌లతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించి మాంసం విక్రయాలు నిర్వహిస్తున్న 58 దుకాణాల్లో తనిఖీలు చేశామన్నారు. పట్టణంలోని రెండు పశు వధశాలల భవనాలు శిథిలం కావడంతో పట్టణంలో 35చోట్ల గొర్రెపోతులు, మేకపోతులను వారివారి ఇళ్లలో, రోడ్ల వెంబడి కోసి మాంసం విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. పరిశుభ్రమైన ప్రాంతాల్లో మాంసాన్ని విక్రయించాలని, మెరుగైన పట్టణ ప్రజారోగ్యం కోసం అలాంటి పరిస్థితుల కల్పనపై, పట్టణ మాంసం కేంద్రాల తనిఖీల్లో గుర్తించిన అంశాలను జిల్లా పశువైద్య, పశుసంవర్ధక అధికారి ద్వారా కలెక్టర్‌కు నివేదికను పంపిస్తామన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ పారిశుధ్య అధికారులు రాజయ్య, బాబురావు, ఆనందరావు, సిబ్బంది, జవాన్లు తదితరులు పాల్గొన్నారు.

14 నుంచి దండుమైసమ్మ ఆలయ వార్షికోత్సవాలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న అభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామస్థులు

ఆత్మకూరు(ఎస్), ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా ఆత్మకూరు(ఎస్) మండలం నెమ్మికల్‌లోని దండు మైసమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవాలను ఈ నెల 14 నుంచి 16వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ తంగెళ్ల కర్నాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆలయం వద్ద ఉత్సవాల కరపత్రాలను కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. పెద్దసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పచ్చిపాల వెంకన్న, ఎరుకుల సర్వయ్య, మోరపాక రాజు, జంగా బాలరాజు, రేణిగుంట్ల సునీత, పుష్పాల శ్రీను, గోపగాని లక్ష్మి, పేరం శ్రీనివాస్, కాసర్ల రాంరెడ్డి, వీరబోయిన రేణుక, బోడ్డుపల్లి విజయలక్ష్మి, మోరపాక పిచ్చయ్య పాల్గొన్నారు.



కమ్ముకుంటున్న కారు మేఘం

రెండు రోజులుగా ఎండ, ఉక్కపోతతో ఇబ్బంది పడ్డ ప్రజలు వాతావరణం ఆదివారం కాస్తంతా చల్లబడటంతో ఆస్వాదించారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఎండ కాస్తుండగానే కారు మబ్బులు కమ్ముకొచ్చాయి.. (ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం

వేములపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి మూసీవాగులో ఈ నెల 8న గల్లంతైన యువకుడు మృతి చెందాడు. అతడి మృతదేహం ఆదివారం లభ్యమైనట్లు నల్లగొండ జిల్లా వేములపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆమనగల్లు గ్రామానికి చెందిన మద్దెబోయిన రామకృష్ణ(24) ఈ నెల 8న మూసీవాగులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు గల్లంతయ్యాడు. రెండు రోజులుగా మూసీవాగు వెంట గాలింపు చర్యలు చేపట్టారు. ఆదివారం మధ్యాహ్నం సూర్యాపేట జిల్లా నేరేడుచర్ల మండలం చింతకుంట్ల సమీపంలోని మూసీవాగులో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వారి కుటుంబసభ్యులతో అక్కడికి వెళ్లి చూడగా రామకృష్ణగా గుర్తించారు. రామకృష్ణ తండ్రి మద్దెబోయిన చిన వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మిర్యాలగూడ పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నిజాయితీ చాటుకున్న బీఆర్ఎస్ నేత



మంగమ్మకు పర్సును అప్పగిస్తున్న బీఆర్ఎస్‌నేత రమేష్‌నాయక్

దేవరకొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డుపై దొరికిన పర్సును అందజేసి బీఆర్ఎస్ నేత తన నిజాయితీని చాటుకున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చందంపేట మండలం రేకులగడ్డ గ్రామానికి చెందిన బొమ్ము మంగమ్మ రాఖీ పండగ సందర్భంగా తన పుట్టింటికి వెళుతూ పీఏపల్లి మండలం అంగడిపేట వద్ద శనివారం సాయంత్రం తన పర్సును రోడ్డుపైన పోగొట్టుకుంది. ఆ సమయంలో ద్విచక్ర వాహనంపై దేవరకొండ వైపు వస్తున్న దేవరకొండకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు రమావత్ రమేష్‌నాయక్ రోడ్డుపై పర్సును గమనించాడు. తీసి చూడగా అందులో ఆధార్‌కార్డుతోపాటు రూ.3వేల నగదు ఉంది. వెంటనే ఆధార్‌కార్డు ఆధారంగా ఆచూకీ తెలుసుకున్న రమేష్‌నాయక్ ఆదివారం బొమ్ము మంగమ్మ కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. విషయం తెలుసుకున్న మంగమ్మతో పాటు కుటుంబసభ్యులు ఆదివారం దేవరకొండకు చేరుకొని రమేష్‌నాయక్ వద్ద ఉన్న పర్సును తీసుకున్నారు. రోడ్డుపైన పోగొట్టుకున్న పర్సును చూసి నిజాయితీగా అప్పగించిన రమేష్‌నాయక్‌ను మంగమ్మ కుటుంబ సభ్యులు అభినందించి, కృతజ్ఞతలు తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



కళాశ్రీ(ఫైల్‌ఫొటో)

పాలకవీడు, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని రావిపహాడ్‌లో శనివారం రాత్రి జరిగింది. ఎస్ఐ కోటేష్ తెలిపిన వివరాల ప్రకారం పాలకవీడు మండలం జాన్‌పహాడ్ గ్రామానికి చెందిన కళాశ్రీ(20) 18 నెలల కిందట అదే మండలం రావిపహాడ్ గ్రామానికి చెందిన బట్టు పవన్‌ను పెద్దలను ఒప్పించి ప్రేమ వివాహం చేసుకుంది. వీరికి 7 నెలల పాప ఉంది. ఇటీవల భార్యభర్తల మధ్య తరుచూ గొడవలు జరుగుతున్నాయి. శనివారం భర్త, పాపతో నిద్రించించారు. అర్ధరాత్రి పాప ఏడుపు వినిపించడంతో నిద్రలేచిన పవన్‌కు భార్య కళాశ్రీ ఉరివేసుకుని కనిపించింది. వెంటనే ఉరి తాడును తొలంగించి చూసే సరికి అప్పటికే ప్రాణం పోయింది. సంఘటన సమాచారం తెలుసుకున్న కోదాడ డీఎస్పీ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ కోటేష్‌లు పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. తమ కుమార్తెను భర్త పవన్, కుటుంబసభ్యులే కలిసి కొట్టి చంపారని కళాశ్రీ తండ్రి శేషగిరిరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధ యాచకురాలు మృతి

కొండమల్లేపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లిలో గుర్తుతెలియని వృద్ధ యాచకురాలు మృతి చెందింది. ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి చౌరస్తా వద్ద అనారోగ్యంతో బాధపడుతూ నడవలేని పరిస్థితిలో ఉన్న వృద్ధురాలైన యాచకురాలిని గుర్తించిన 108 సిబ్బంది చికిత్స నిమిత్తం దేవరకొండ ఏరియాస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఆమె ఆదివారం మృతి చెందింది. ఆమె వయస్సు 60 నుంచి 65 ఏళ్ల ఉంటాయని, ఆకుపచ్చ పువ్వులు గల చీరను ధరించినట్లు ఎస్ఐ తెలిపారు. సంబంధీకులు ఉంటే కొండమల్లేపల్లి సీఐ సెల్ 8712670226, ఎస్ఐ సెల్ 8712670158 నెంబర్లకకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో గోల్‌మాల్

● ఎమ్మెల్యేకు లబ్ధిదారుడి ఫిర్యాదుతో భాగోతం బట్టబయలు

కోదాడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో గోల్‌మాల్ తతంగం వెలుగుచూసింది. బాధితుడు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయడంతో అసలువిషయం బయటపడింది. ఇందులో గత ప్రభుత్వంలో మాజీ ప్రజాప్రతినిధికి చెందిన ఓ వ్యక్తి, మరికొందరు ఉన్నట్లు సమాచారం. వివరాల్లోకి వెళితే నడిగూడెం మండలం వాయిలసింగారం గ్రామానికి చెందిన గద్దె వెంకటేశ్వరరావు(అసలు లబ్ధిదారుడు) 2023లో గుండెకు ఆపరేషన్ చేయించుకున్నాడు. అందుకు రూ.4.5లక్షల ఖర్చు అయ్యింది. సీఎం రిలీఫ్‌ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. పలుమార్లు మాజీ ప్రజాప్రతినిధి కార్యాలయానికి వెళ్లి సీఎంఆర్ఎఫ్ చెక్కుపై ఆరాతీశారు. చెక్కు రాలేదని కార్యాలయ సిబ్బంది చెబుతుండటంతో వెనుతిరిగేవారు. ఇటీవల ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి వాయిలసింగారం గ్రామానికి వెళ్లగా, ఆమె దృష్టికి సమస్యను వెంకటేశ్వరరావు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి వివరాలు రాబట్టలని పీఏను ఆదేశించింది. చెక్కుపై విచారణ చేయగా చెక్కు వచ్చి డబ్బులు డ్రా అయినట్లు తెలిసింది. దీంతో సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో గోల్‌మాల్ వ్యవహారం బయటపడింది.

ఇంటిపేరు లేకుండా ఉండటంతో..

చెక్కులపై ఇంటిపేరు కాకుండా ఇంటిపేరులోని మొదటి అక్షరాన్నే పేర్కొంటుండటం అక్రమాలకు అవకాశం ఏర్పడింది. చెక్కుపై గద్దె వెంకటేశ్వరరావు బదులు జీ వెంకటేశ్వరరావు ఉండటంతో స్కాం సూత్రధారులు ఏపీలోని జగ్గయ్యపేట మండలంలో బుగ్గమాధారం గ్రామానికి చెందిన జి వెంకటేశ్వరరావుకు రూ.1.50 లక్షల చెక్కును అందజేసి, నగదును కాజేశారు. అదేవిధంగా చింతలపాలెం మండలం దొండపాడు గ్రామానికి చెందిన ముగ్గురు నకిలీ లబ్ధిదారులు ఒక్కొక్కరు రూ.60 వేల చెక్కులను డ్రా చేసినట్లు తెలుస్తోంది. సుమారు 50కి పైగా అసలు లబ్ధిదారులకు చెక్కులను ఇవ్వకుండా వారి పేర్లు, ఇంటి పేర్లతో సరిపోయే వేరే వ్యక్తులకు అందజేసి, ఆ మొత్తాన్ని తమ ఖాతాలో వేసుకున్నట్లు తెలుస్తోంది. దీంతో రూ.లక్షల్లో చేతులు మారినట్లు సమాచారం.

ప్రాథమిక విచారణ చేపట్టిన పోలీసులు

గద్దె వెంకటేశ్వరరావు ఫిర్యాదుతో కోదాడ పట్టణ పోలీసులు ప్రాథమిక విచారణ చేపట్టారు. నకిలీ లబ్ధిదారులను గుర్తించి రహస్యంగా విచారణ చేస్తునట్లు సమాచారం. ఈ క్రమంలో నకిలీ ధ్రువపత్రాలు సృష్టించిన మరో వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

ప్రమాదం.. వర్షంలో ప్రయాణం



యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం నేలపట్లలో వాగులో చిక్కిన కారు (ఫైల్)

వారం రోజులుగా నిత్యం ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తోంది. సరిగ్గా లేని రహదారులపైకి వచ్చే వరద నీటితో ఏ ప్రమాదం ఎక్కడ పొంచి ఉందో తెలియని పరిస్థితి. కూడళ్లు, కల్వర్టులపైనా వరద పోటెత్తుతోంది. నీటి ప్రవాహ ఉధృతిలో వాహనాలు కొట్టుకుపోతున్న సంఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలంలో వరదలో కారు చిక్కుకున్న సంఘటన చోటుచేసుకుంది. దీంతో ప్రయాణం ప్రాణసంకటంగా మారుతోంది. కొత్త ప్రాంతాలకు వెళ్లినప్పుడు వర్షంలో మరింత అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముంది.

● వాహనాలతో జాగ్రత్తగా ఉండాలంటున్న నిపుణులు

(ఆంధ్రజ్యోతి-మిర్యాలగూడ టౌన్)

ముంచెత్తుతున్న వర్షాలతో వరద ఉధృతి పెరుగుతోంది. రాష్ట్ర రాజధానితో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రధాన పట్టణాల్లో వానొచ్చిందంటే వరదన్న పరిస్థితుంది. రహదారులు జలమయమవుతుండగా, లోతట్టు ప్రాంతాలన్నీ నీట మునుగుతున్నాయి. భారీ వర్షాల సందర్భంలో వరదనీటికి అంచనా వేయలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. కల్వర్టులు, కాజ్‌వేలపై పారుతున్న నీటి ప్రవాహం ఎంత ఉందనేది అర్థం కాకపోవడంతో వాహనదారులు వరదనీటిలో కొట్టుకుపోతున్నారు. వర్షాలు, వరదల సమయంలో ఎవరికి వారే అప్రమత్తంగా ఉండాలి.

సంయమనం పాటించాలి..

దంచికొడుతున్న వానలతో ముంచుకొస్తున్న వరదలలో వాహనదారులు సంయమనం పాటించాలంటున్నారు నిపుణులు. వరద ఉధృతిలో వాగులు, వంకలు దాటరాదంటున్నారు. కార్లు, బైక్‌లను నీటిలో నియంత్రించడం కష్టతరమంటున్నారు. ప్రధానంగా కార్లు లోతు తక్కువగా ఉన్న వరదలోనూ కొట్టుకుపోయే ప్రమాదముందని హెచ్చరిస్తున్నారు. వాతావరణ సూచనల ప్రకారం ప్రయాణాలను వాయిదా వేసుకోవాలంటున్నారు.

వర్షాలు, వరదల సమయంలో..

● రహదారులపై తడి ఉంటే వాహనం జారిపోయే ప్రమాదముంటుంది. వేగాన్ని పూర్తిగా నియంత్రించాలి.

● వర్షపు నీరు లైనర్లలోకి చేరి బ్రేకులు సరిగా పడవు. అందుకే తక్కువ స్పీడులో ప్రయాణించాలి.

● కారైనా, బైక్ అయినా హెడ్‌లైట్లు వేసుకోవాలి, ముందు వెళ్లే వాహనానికి తగినంత దూరం ఉంటూ నెమ్మదిగా వెళ్లాలి.

● కార్లలో వైపర్లు వాడుతూ, డిఫ్రాస్టర్ మోడ్ ఆన్ చేసుకోవాలి.

● నీటి ప్రవాహంలోకి వెళ్లాల్సి వస్తే వాహన ఇంజిన్ ఆగకుండా చూసుకోవాలి, కారు కదలికను బట్టి ఫస్ట్/సెకండ్ గేర్ మాత్రమే వాడాలి.

● పొరపాటున కార్ ఇంజిన్ వరదనీటిలో ఆగిపోతే, తిరిగి స్టార్ట్ చేయకుండా ఉండాలి. స్టార్ట్ చేస్తే ఎక్కువ నష్టం కలిగే ప్రమాదముంది.


ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది



భారీ వర్షాలు కురిసినా, కురిసే సందర్భాల్లో ప్రయాణం వాయిదా వేసుకోవడమే మంచిది. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే ప్రజారవాణా మార్గాలను ఆశ్రయించాలి. కుటుంబమంతా కలిసి కారులో వెళ్లాల్సి వస్తే తొందరపాటు వద్దు. మరింత అప్రమత్తంగా వాహనాన్ని నడపుకుంటూ వెళ్లాలి. అక్కడక్కడా ప్రవాహాలు కూడా రహదారుల మాదిరిగా కనిపిస్తాయి. వరద ఉధృతి, లోతును అంచనా వేసుకోవాలి. అర్థం కాకుంటే వాహనం నిలిపి స్థానికులను అడిగి తెలుసుకోవాలి.

-రాజశేఖరరాజు, డీఎస్పీ, మిర్యాలగూడ.

నీటిలో మునిగితే మొరాయిస్తాయి



వాహనమేదైనా నీటిలో మునిగితే మొరాయిస్తుంది. షెడ్డుకు వచ్చే వాహనాలలో అలాంటివే ఎక్కువ. వరదనీటిలో వాహనాలను నడపొద్దు. ఒకవేళ నడిపితే.. ఇంజిన్‌లోకి నీరు చేరకుండా చూసుకోవాలి. కారు నీటి మధ్యలో ఆగితే తిరిగి స్టార్ట్ చేయవద్దు. అలా చేస్తే వాహన ఎలక్ట్రానిక్ సిస్టం అంతా పాడయ్యే ప్రమాదముంది. నీటిలో మునిగిన కార్లలో పెట్రోల్ కంటే డీజిల్ వాహనాలకే రిపేర్లు ఎక్కువగా ఉంటాయి.

ఎండీ. ఖాదర్, సీనియర్ కార్ మెకానిక్, మిర్యాలగూడ.

'నులి' పేద్దాం

● నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం

పిల్లల్లో పోషకాహార లోపం, రక్తహీనతతో ఎల్లప్పుడూ అలసటగా ఉండటం, శారీరక మానసిక అభివృద్ధి లేకపోవడం వారి పేగులలో జీవించే పరాన్నజీవులైన నులి పురుగులే కారణం. దీంతో ఈ సమస్యను పరిష్కరించడానికి ప్రభుత్వం ప్రతి సంవత్సరం అన్ని విద్యా సంస్థల్లో పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు ఉచితంగా పంపిణీ చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం(నేటి) నుంచి ఈ నెల 18వ తేదీ వరకు మాత్రల పంపిణీకి ఏర్పాట్లు చేసింది. (ఆంధ్రజ్యోతి- భువనగిరి(కలెక్టరేట్)



రాజాపేటలో విద్యార్థినులకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్న ఆశా కార్యకర్తలు (ఫైల్)

పిల్లలు పాదరక్షలు లేకుండా మట్టిలో ఆడుకోవడం, బహిరంగ మలవిసర్జన చేయడం, మురుగుచేతులతో ఆహారాన్ని స్వీకరించడం వల్ల పిల్లలకు ఇన్ఫెక్షన్ సోకి వారి మలంలో నులిపురుగులు గుడ్లు పెడుతాయి. గుడ్లు మట్టితో కలిసి పెరిగి ఇన్‌ఫెక్షన్ లేని పిల్లలకు స్పర్శ ద్వారా పిల్లల శరీరాల్లోకి వెళ్లి కడుపు నొప్పికి దారి తీస్తాయి. దీంతో అలసట కలిగి పోషకాహారం లోపంతో పిల్లలు బలహీనతకు గరవుతారు. శారీరక మానసిక అభివృద్ధి కుంటు పడి తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశముంది.

పిల్లల్లో నులి పురుగుల ప్రభావం..

1 నుంచి 19 ఏళ్ల వారందరిలో నులి పురుగుల ప్రభావం వల్ల కడుపు నొప్పి, వికారం, వాంతులు విరేచనాలు కలుగుతాయి. ఆకలి మందగించడంతో పోషకాహార లోపం ఏర్పడుతుంది. రక్తహీనతకు గురై బలహీన పడుతూ బరువు తగ్గుతారు. నులి పురుగులు పిల్లల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి శారీరక మానసిక అభివృద్ధి కుంటుపడే అవకాశం ఉంది.

మాత్రలు వాడే విధానం

ఒకటి, రెండేళ్ల పిల్లలకు అల్బెండజోల్ సగం మాత్రను పొడి చేసి పాలు లేదా నీటిలో కలిపి తాగించాలి. రెండు నుంచి మూడేళ్ల పిల్లలకు మాత్రను పూర్తిగా చూర్ణం చేసి నీటితో అందించాలి. మూడేళ్ల పైనున్న వారు మాత్రను పూర్తిగా నమిలి మింగాలి. అల్బెండజోల్ మాత్రలను ఇంటికి ఇవ్వరని గుర్తు పెట్టుకోవాలి.

ప్రయోజనాలివే..

పలు జాగ్రత్తలు పాటించి పిల్లల్లో నులి పురుగులను నిర్మూలించవచ్చు. చేతి గోర్ల ను చిన్నవిగా ఉంచుకోవడం ద్వారా మట్టి చేరకపోవడంతో నులిపురుగులు శరీరంలోకి వెళ్లవు. ముఖ్యంగా భోజనం చేసేముందు చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలి. మరుగుదొడ్డిని వినియోగించిన పిదప కూడా చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలి. ఎల్లప్పుడూ పాదరక్షలు ధరించాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా నులిపురుగుల వ్యాప్తిని అరికట్టవచ్చు. దీం తో పిల్లలలో మెరుగైన రక్తహీనత కలిగి శక్తితో అలసట లేకుండా ఉంటారు. పోషకాహార స్థితిలో మార్పుతో శారీరక మానసిక అభివృద్ధి పొందుతారు. ఆరోగ్యకర సమాజానికి నాంది పలుకుతారు.

జిల్లాలో 1.43 లక్షల మందికి మాత్రల పంపిణీ లక్ష్యం



నులి పురుగుల నివారణ మాత్రల పంపిణీకి జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశాం. యాదాద్రి భువనగిరి జిల్లాలో 21 పీహెచ్‌సీలు, 900 అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలతో పాటుగా బడిబయటి పిల్లలకోసం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో మొత్తం 1795 కేంద్రాల ద్వారా 1,43,789 మందికి అల్బెండజోల్ మాత్రలు వేయడానికి ప్రణాళికలు చేశాం. 1.75 లక్షల మాత్రలు అందుబాటులో ఉన్నాయి. 246 మంది మల్టీపర్పస్ మహిళా హెల్త్ వర్కర్లతో పాటుగా 843 అంగన్‌వాడీ టీచర్లు, 690 మంది ఆశా కార్యకర్తలు నులి పురుగుల దినోత్సవంలో పాల్గొంటున్నారు. ఆగస్టు 11 నుంచి 18 వరకు కార్యక్రమం కొనసాగుతుంది. 100 శాతం కార్యక్రమాన్ని విజయవంతం చేస్తాం.

-ఏ. భాస్కరరావు,
జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)

భక్తజనసంద్రం..యాదగిరిక్షేత్రం

● కోలాహలంగా ఆలయ తిరువీధులు ●భక్తులతో రద్దీగా మారిన క్యూలైన్లు



నిత్య కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి) : యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి దివ్యక్షేత్రం ఆదివారం భక్తజన సందోహంగా మారింది. శనివారం రాఖీ పం డుగ, ఆదివారం సెలవు దినం కావడంతో రెండు రోజుల రద్దీ యాదగిరి కొండపై నెలకొంది. ఇష్టదైవా న్ని దర్శించుకునేందుకు భక్తులు సుమారు 35వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి వచ్చారు. కాగా, ప్రత్యేక, ధర్మదర్శన క్యూ లైన్లు ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు బారులు తీరారు. ఉదయం 9 నుంచి 10 గంటలు, సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు బ్రేక్ దర్శనం, మధ్యాహ్నం రాజభోగం (ఆరగింపు) వరకు మూడు గంటల పాటు భక్తులు క్యూలైన్‌లో వేచి ఉన్నారు. ప్రధానాలయం, కల్యా ణోత్సవం, వ్రతమండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల్లో వద్ద కూడా రద్దీ నెలకొంది. ఆలయ ఉత్తర దిశలో భక్తులు ఫొటోలకు పోటీ పడ్డారు. కొండపైన బస్టాండులో బస్సుల కోసం భక్తులు (ప్రయాణికులు) ఎగబడ్డారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.37,49,950 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు తెలిపారు. కాగా, కొండపైన ప్రతివారం నిర్వహించే సంగీత సభల్లో భాగంగా మీనాక్షి కూచిపూడి డాన్స్ అసోసియేషన్ (విశాఖపట్నం) ఇచ్చిన కూచిపూడి నృత్యం, శ్రీ లాస్య నృత్యాలయ (హైదరాబాద్) భరత నాట్య ప్రదర్శన భక్తులను ఎంతో ఆకట్టుకుంది.

శాస్త్రోక్తంగా నిత్య పూజలు

సుప్రభాత సేవతో స్వామి అమ్మవార్లను మేల్కొపిన అర్చకులు నిత్యపూజలు సంప్రదాయరీతిలో నిర్వహించారు. గర్భాలయంలో స్వయంభువులకు అభిషేకం, అర్చనలు, ప్రాకార మండపంలో హోమం, నిత్య కల్యాణోత్సవ పర్వాలు వైభవంగా చేపట్టారు. అదేవిధంగా పాతగుట్ట స్వామిఅమ్మవారలకు నిత్య పూజలు పూజారులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్రహవన పూజలు, శైవాగమరీతిలో నిర్వహించారు. రాత్రి మహానివేదన, శయనోత్సవాలతో ఆలయ ద్వార బంధనం చేశారు



గర్భాలయం ఉభయ క్యూలైన్లల్లో భక్తులు

ఆలయ భద్రతకు పెద్దపీట : ఈవో వెంకట్రావు



యాదగిరి కొండపై మానిటరింగ్ సిస్టం వద్ద ఎస్పీఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఈవో వెంకట్రావు

యాదగిరిగుట్ట, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో భద్రతకు పెద్దపీట వేస్తామని దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావు చెప్పారు. యాదగిరికొండపై ఆదివారం దేవస్థానం ప్రధాన కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఆలయ భద్రతకు అవసరమైన సిబ్బందిని అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించాలని అధికారులకు సూచించారు. సిబ్బందిని సరఫరా చేసేందుకు అర్హత గల ఏజెన్సీ నుంచి టెండర్లు ఆహ్వానించాలన్నారు. కొండపైన నిర్వహించాల్సిన టెండర్లను పిలిచేందుకు తగిన చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖ అధికారులకు వివరించారు. ఆలయ పరిసరాలు, కొండకింద ఆధ్యాత్మిక వాడల్లో పెట్రోలింగ్ నిర్వహించేందుకు వాహనం ఏర్పాటు చేయాలన్నారు. దేవస్థాన పరిసర ప్రాంతాల్లో ఎల్‌ఈడీ స్ర్కీన్లు ఏర్పాటు చేయాలని సివిల్ విభాగం అధికారులకు సూచించారు. అంతకుముందు భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో ఉభయ క్యూలైన్లు, పోలీసు కంట్రోల్ రూంలో సీసీ పుటేజీ మానిటరింగ్ సిస్టంను పరిశీలించారు. సమీక్షలో ఏఈవో గజ్వేల్లి రమేష్‌బాబు, ఎలక్ట్రికల్ ఈఈ ఊడెపు వెంకటరామరావు, ఏఈవో గజ్వెల్లి రఘు, ఉప ప్రధానార్చకుడు మాధవాచార్యులు, ఎస్పీఎఫ్ ఎస్ఐ అనిల్ పాల్గొన్నారు.

పాలకవర్గాల గడువు పొడిగింపేనా?

(5వ పేజీ తరువాయి)

కాలం గడువు పెంచాలని విజ్ఞప్తి చేయగా, సీఎం సానుకూలంగా స్పందించి ఆ మేరకు ఆదేశాలు జారీ చేశారు. ప్రస్తుతం సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలపై ఇంకా స్పష్టత రాకపోగా, మునిసిపల్ ఎన్నికలపై కూడా సందిగ్ధత ఉంది. ఈ నేపథ్యంలో సహకార ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో అసాధ్యమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువును మరో ఆరు నెలల పాటు పొడిగించే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఇప్పటికే గ్రామపంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించడంతో ఎన్నికలు ఆలస్యమై పంచాయతీలకు నిధులు రాని పరిస్థితులు నెలకొన్నాయి. ఈ పరిస్థితుల్లో జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు పీఏసీఎస్‌లకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తే బ్యాంకుల పురోగతిపై ప్రభావం చూపించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకుతో పాటు సొసైటీలు, బ్రాంచ్‌లు ప్రస్తుతం లాభాల బాటలో ఉన్న నేపథ్యంలో ఎన్నికలు నిర్వహించే వరకు కొనసాగుతున్న పీఏసీఎస్ పాలకవర్గాలతో పాటు డీసీసీబీ పాలకవర్గాన్ని మరో ఆరు నెలలు పొడిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్, నాఫ్స్కాబ్ డైరెక్టర్ కుంభం శ్రీనివా‌స్‌రెడ్డితో పాటు రాష్ట్రంలోని ఇతర డీసీసీబీల చైర్మన్‌లు ఒకటి, రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి సహకార ఎన్నికలు నిర్వహించే వరకు బ్యాంకుల అభివృద్ధి కోసం పాలకవర్గాలను మరో ఆరు నెలల పాటు పొడిగించాలని కోరనున్నట్టు సమాచారం.

మిగిలింది నాలుగు రోజులే!

(5వ పేజీ తరువాయి)

దని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

నల్లగొండ జిల్లాలో పరిస్థితి ఇలా

నల్లగొండ జిల్లాలోని 33 రెవెన్యూ మండలాల్లోని 566 రెవెన్యూగ్రామాల్లో నిర్వహించిన భూభారతి రెవెన్యూ సదస్సుల్లో 43,636 దరఖాస్తులు వచ్చాయి. వీటిల్లో అత్యధికంగా సాదాబైనామాలకు సంబంధించినవి ఉండగా, ఆతర్వాత మిస్సింగ్ సర్వేనెంబర్లు, పౌతి, అసైన్డ్‌భూముల సమస్యలు(పీవోటీలు), పెండింగ్ మ్యుటేషన్లు, క్లరికల్ మిస్టేక్స్, భాగ పంపిణీలు, సర్వేనెంబర్ల ఎర్రర్స్, నాలా సమస్యలు, ఖాతాలు కలిసిపోయినవి, కోర్టుకేసులు ఉన్నాయి. అందులో ఇప్పటివరకు సుమారు 5వేల వరకు దరఖాస్తులను పూర్తిగా పరిశీలించగా, మరికొన్ని దరఖాస్తులు పరిశీలన పూర్తిచేసి కలెక్టర్ లాగిన్‌కు, సీసీఎల్ఏ లాగిన్‌కి పంపినట్టు సమాచారం. కోర్టు సమస్యలు, సాదాబైనామాలు, పీవోటీల దరఖాస్తులను పరిష్కరించే పరిస్థితి లేకపోవడంతో వాటికి సంబంధించిన అర్జీలను పక్కనబెడుతున్నారు. మొత్తంగా పంద్రాగస్టు నాటికి గరిష్ఠంగా 10వేల వరకు దరఖాస్తులు పరిష్కరమవుతాయని, పరిష్కరించడానికి ఆస్కారమున్న మరో 10వేలదరఖాస్తుల వరకు ఇంకో 15రోజుల్లో పూర్తిచేస్తారని తెలుస్తోంది. మిగిలినవాటిపై ప్రభుత్వం ఉన్నతస్థాయిలో తీసుకునే నిర్ణయాల మేరకు పరిష్కారాలుంటాయని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు.

జాతీయ రహదారిపై వాహనాల రద్దీ

● రాఖీ పండుగ... పెళ్లిళ్లతో కిటకిట లాడిన వాహనాలు



చిట్యాల మండలం పెద్దకాపర్తిలో జాతీయ రహదారిపై బారులుగా వెళుతున్న వాహనాలు

చౌటుప్పల్ టౌన్, చిట్యాల రరూరల్ ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్, నల్లగొండ జిల్లా చిట్యాలలోని 65వ నంబరు జాతీయ రహదారిపై ఆదివారం ఇరు వైపుల వాహనాల రద్దీ కొనసాగింది. శనివారం రాఖీ పండుగ, ఆదివారం పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు ఉండడంతో పట్టణం ప్రయాణికులతో కిటకిట లాడింది. హైవేపై ఇరు వైపుల వాహనాలు బారులు తీరి వెళ్తుండగా, సర్వీస్ రోడ్లతోపాటు భువనగిరి, మునుగోడు వెళ్లే రహదారులు ద్విచక్రవాహనాలు, పాదచారులతో నిండిపోయాయి. ఏ రోడ్డును చూసినా పరుగులు తీసే ప్రజలే దర్శనమిచ్చారు. హైవేపై జంక్షన్ల వద్ద దాటాలంటే 10 నుంచి 15 నిమిషాలు ఎదురు చూడాల్సి వచ్చింది. రాఖీ పండుగకు వెళ్లిన నగరవాసులు ఆదివారం సాయంత్రం నుంచి తిరుగు పయనమయ్యారు. ఒక పక్క రాఖీ పండుగ ప్రజలు, మరో పక్క పెళ్లిళ్ల, ఇతర శుభ కార్యాలకు వెళ్తే వారితో హైవే రద్దీగా మారింది. ఇక ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి. ప్రధానంగా చౌటుప్పల్ నుంచి నల్లగొండ వైపు బస్‌లలో వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. హైవేపై ట్రాఫిక్ జామ్ కాకుండా రెండు మొబైల్ పార్టీలను నియమించారు. చౌటుప్పల్ ఏసీపీ మధుసూదన్‌రెడ్డి పర్యవేక్షణలో సీఐలు మన్మథకుమార్, విజయ్ మోహన్‌లు ట్రాఫిక్ నియంత్రణలో నిమగ్నమయ్యారు. 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఏసీపీ ఆదేశించారు.

సర్కార్ బడిలో చక్కటి ఒరవడి



నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామెర భీమనపల్లి ప్రాథమిక పాఠశాల

మర్రిగూడ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం దామర భీమనపల్లి ప్రాథమిక పాఠశాలలో గోడలపై తెలుగు, ఆంగ్ల వర్ణమాలను ఉపాధ్యాయులు రాసి బోధిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో కూడా ఉపాధ్యాయులు గుణాత్మకమైన విద్యను బోధిస్తున్నారు. ఆ పాఠశాల హెచ్ఎం ఉదావత్ లచ్చీరాంనాయక్ ఉపాధ్యాయ బృందంతో కలసి మీ పిల్లల భవిష్యత్తుకు మాది భరోసా అంటూ ఇంటింటికీ తిరుగుతూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. దీంతో గత ఏడాది 30 మంది విద్యార్థులతో ఉన్న పాఠశాల ప్రస్తుతం 95 మందికి చేరుకుంది. విద్యార్థులు పాఠశాలకు రాకపోతే తల్లిదండ్రులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తున్నారు. మధ్యాహ్న భోజనం పథకం ద్వారా వండిన వంటలను విద్యార్థులతో కలిసి ఉపాధ్యాయులు నిత్యం సహపంక్తి భోజనం చేస్తున్నారు. ఈ పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన చూసి ప్రభుత్వ ఉద్యోగులు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ఈ పాఠశాలలో చేర్పిస్తున్నారని హెచ్ఎం తెలిపారు.

మళ్లీ తెరుచుకున్న సాగర్ గేట్లు

● ఎనిమిది క్రస్ట్‌గేట్ల ద్వారా నీటి విడుదల ● పూర్తిస్థాయికి చేరుకున్న సాగర్ నీటి మట్టం



నాగార్జునసాగర్ నుంచి కిందికి పరవళ్లు తొక్కుతున్న కృష్ణమ్మ

నాగార్జునసాగర్, కేతేపల్లి, వలిగొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్‌గేట్లను మళ్లీ తెరిచారు. ఈ నీటి సంవత్సరంలో సాగర్ గేట్లు రెండోసారి తెరుచుకున్నాయి. ఈ ఏడాది మొదటిసారి జూలై 29న సాగర్ క్రస్ట్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేశారు. వరద రాక తగ్గటంతో ఈ నెల 6న గేట్లను మూసి వేశారు. సాగర్‌కు ఎగువ నుంచి వరద రాక 50వేల క్యూసెక్కులు నిలకడగా కొనసాగుతుండటంతో ఆదివారం ఉదయం 5గంటలకు ప్రాజెక్టు నీటిమట్టం పూర్తిస్థాయికి (590 అడుగులు) చేరింది. దీంతో ఉదయం 2గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్ట్ అధికారులు దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం రెండు గంటల సమయానికి వరద రాక స్వల్పంగా పెరగటంతో మరో 2గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. సాయంత్రం 6గంటల సమయానికి మరో 4గేట్లను ఎత్తి మొత్తం 8గేట్ల ద్వారా దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగర్ కుడి కాల్వ ద్వారా 6,465 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాల్వ ద్వారా 7,518 క్యూసెక్కుల నీటిని, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కుల నీటిని, వరద కాల్వ ద్వారా 300 క్యూసెక్కుల నీటిని ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 28,988 క్యూసెక్కుల నీటిని 26 క్రస్ట్‌గేట్లలో 8గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 64,800 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 1,09,871 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా ఎగువ నుంచి 65,842 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీకి కొనసాగుతున్న వరద ఉధృతి

ఎగువ మూసీ పరివాహక ప్రాంతాలతోపాటు రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు నల్లగొండ జిల్లా కేతేపల్లి మండల పరిధిలో మూసీ నదికి వరద ఉధృతి కొనసాగుతూనే ఉంది. దీంతో సూర్యాపేట, నల్లగొండ జిల్లాల నడుమ ఉన్న మూసీ ప్రాజెక్టుకు ఐదు రోజులుగా ఇన్‌ఫ్లో భారీగా ఉంటోంది. శనివారం రాత్రి ఇన్‌ఫ్లో కొంత మేర తగ్గడంతో అప్పటి వరకు ఐదు అడుగుల మేర ఎత్తి 9,572 క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేస్తూ వచ్చిన అధికారులు 4వ, 8వ నెంబర్ గేట్లను మూసి 2, 3, 10వ నెంబర్ క్రస్టుగేట్లను రెండు అడుగులకు తగ్గించి 3,828 క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. ఆదివారం ఉదయం వరకూ ఇదే రీతిన వరదను దిగువకు వదులుతూ వచ్చిన అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో పెరిగి 6,077 క్యూసెక్కులుగా నమోదవడంతో ఆదివారం మధ్యాహ్నం 2వ, 3వ నెంబర్ క్రస్టుగేట్లకు తోడు 10వ నెంబరు గేటును సైతం రెండు అడుగుల మేర ఎత్తి మొత్తం మూడు గేట్ల ద్వారా 4,340క్యూసెక్కుల వరదను దిగువకు వదిలారు. ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకూ ఇదే పరిస్థితి కొనసాగింది. ఇదిలా ఉంటే మూసీ ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 645అడుగులు(4.46టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 643.33అడుగులు (4.02టీఎంసీలు)గా ఉంది. ప్రాజెక్టు కుడి, ఎడమ కాల్వల ద్వారా ఆయకట్టుకు 454.86క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

పరవళ్లు తొక్కుతున్న మూసీ



మూసీ ప్రాజెక్టు క్రస్ట్ గేట్ల నుంచి దిగువకు వెళ్తున్న వరద నీరు

హైదరాబాద్‌లో కురుస్తున్న భారీ వర్షానికి మూసీ పరవళ్లు తొక్కుతుంది. యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలంలో పలు వాగులు, చెరువులు పొంగిపొర్లుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయ్యామయ్యాయి. మండలంలోని సంగెం గ్రామ పరిధిలోని భీమలింగం కత్వ వద్ద ఆదివారం మూసీనది ఉధృతంగా ప్రవహించింది. సంగెం, బొల్లెపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టుపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో అధికారులు ఉదయం నుంచే ముందస్తుగా రాకపోకలను నిలిపివేసి గస్తీ ఏర్పాటు చేశారు. ఈ మార్గంగుండా చౌటుప్పల్ పోచంపల్లి, వలిగొండ పరిసర ప్రాంతాల ప్రజలు జిల్లా కేంద్రం భువనగిరికి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నారు. వలిగొండ మండల కేంద్రం మీదుగా వెళ్తున్నారు. సుమారు 10 కిలోమీటర్ దూరం ప్రయాణించాల్సి వస్తుందని వాహనదారులు పేర్కొంటున్నారు. ప్రొద్దటూర్, వర్కట్‌పల్లి గ్రామాల నడమ మూసీ ఉధృతరూపం దాల్చడంతో సమీప రైతులు పంట పొలాలకు వెళ్లలేకపోతున్నారు. అధికారులు ఈ మార్గాన్ని కూడ మూసివేసి రాకపోకలు నిలిపి వేశారు. సంగెం-గొల్లెపల్లి గ్రామాల మధ్య ఉన్న వరిపొలాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నుంచి చెదురు ముదురుగా ముసురు కురువడంతో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అదేవిధంగా మూసీ పరివాహక ప్రాంత ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు.



వలిగొండ మండలం సంగెం-బొల్లెపల్లి కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న మూసీ

పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలి

చిట్యాల, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చిట్యాలలో సోమవారం నిర్వహించే జరిగే నకిరేకల్, మునుగోడు నియోజకవర్గాల చేయూత పింఛన్‌దారుల మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు మేడి శంకర్, ఎరసాని గోపాల్ కోరారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ హాజరయ్యే ఈ మహాసభకు అన్నిరకాల పెన్షన్‌దారులు హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

జన చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గం



శాలిగౌరారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం గ్రామపంచాయతీ పరిధిలోని బాలిశెట్టిగూడెం జన చైతన్య యువజన సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా వల్లమల్ల పెద్ద సైదులు, ఉపాధ్యక్షుడు కల్లూరు మల్లయ్య, కార్యదర్శి కుంభం సైదులు, సహాయ కార్యదర్శి గండమల్ల రాజు, కోశాధికారిగా వాడపల్లి శివరాజు, తదితర కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

ఆక్రమణకు గురైన ఫీడర్ ఛానల్

● పట్టించుకోని అధికారులు ● ఇబ్బందులు పడుతున్న రైతులు

కట్టంగూరు, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలిమెర గ్రామ శివారులోని రొట్టెకుంట ఫీడర్ ఛానల్‌ను కొందరు వ్యక్తులు ఆక్రమించారు. ఛానల్‌ను ఆక్రమించుకోవడమే కాకుండా పూర్తిగా మట్టితో నింపేశారు. ఫీడర్ చానల్‌పై ఉన్న కట్టను తొలగించడంతో పై నుంచి వరద నీరు కలిమెర గ్రామంలోని రొట్టెకుంటలోకి వెళ్లకుండా వృథాగా పంట పొలాల మీదుగా పోతున్నాయి. దీంతో ఫీడర్ చానల్ చుట్టు పక్కల ఉన్న పత్తిచేలు, వరి పొలాలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పత్తి చేలు నీట మునగడంతో జాలు వచ్చి పంట దెబ్బతింటుందని ఆవేదన వ్యక్తం చేశారు. కలిమెర గ్రామానికి చెందిన కొందరు రైతులు ఫీడర్ ఛానల్ ఆక్రమించడంతో దానిపై ఉన్న మట్టి కట్టను తొలగించిన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని పలువురు రైతులు ఆరోపించారు. ఇదే విషయాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించేందుకు ఐబీకి సంబంధించిన అధికారులు క్షేత్ర స్థాయిలో రెండు సార్లు పరిశీలించిన ప్రతిఫలం లేదన్నారు. ఇదే విషయాన్ని ఇటీవల కలిమెర గ్రామంలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించడానికి వచ్చిన ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకెళ్లామని, వెంటనే ఎమ్మెల్యే స్పందించి కట్టంగూరు తహసీల్దార్‌ను సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అయినా ఇప్పటి వరకు ఆక్రమించిన రైతులపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పైనుంచి వచ్చిన వరద నీరు పంట పొలాల మీదుగా వృథాగా పోతున్నాయి. దీంతో కుంటలోకి చుక్క నీరు రావడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



వృథాగా నీరు పోతుండటం వల్ల పత్తి చేలో నిలిచిన నీరు, (ఇన్‌సెట్‌లో) కలిమెర గ్రామంలో ఆక్రమణకు గురైన ఫీడర్ ఛానల్,

అధికారులు పట్టించుకోవడం లేదు



కలిమెర గ్రామంలో ఫీడర్ ఛానల్ ఆక్రమించడంతో పాటు కట్టను తొలగించడం వల్ల నీరు వృథాగా పోతూ పంట పొలాలు దెబ్బతింటున్నాయి. గ్రామంలోని తెట్టెకుంటలోకి వెళ్లాల్సిన నీరు వృథాగా పోతుంది. ఈ విషయాన్ని అనేక సార్లు ఐబీ అధికారులతో పాటు తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. అధికారులు వస్తున్నారు, పరిశీలిస్తున్నారు తప్ప ఆక్రమించిన రైతులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి న్యాయం చేయాలి.

\- యాట సుధాకర్‌రెడ్డి, రైతు, కలిమెర

ఫీడర్ ఛానల్ ఆక్రమణకు గురైన మాట వాస్తవమే

కలిమెర గ్రామంలోని తొట్టికుంటకు వచ్చే ఫీడర్ ఛానల్‌ను కొందరు రైతులు ఆక్రమించిన మాట వాస్తవం. ఫీడర్ ఛానలపై ఉన్న మట్టిని సైతం రైతులు తొలగించారు. ఐబీ ఈఈ శ్రీనివాస్‌తో పాటు నేను కూడా క్షేత్ర స్థాయిలో రెండుసార్లు పరిశీలించాను. ఫీడర్ ఛానల్ రైతు భూమి మధ్యలో నుంచి వెళ్తుందని, దానిని పూడ్చి భూమి చివర నుంచి ఏర్పాటు చేస్తామని రైతులు చెప్పారు. తప్ప ఆచరణలో పెట్టడం లేదు. ఇదే విషయమై తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లాం. మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించి రైతులతో మాట్లాడి ఆక్రమణకు గురైన ఫీడర్ ఛానల్‌ను పునరుద్ధరిస్తాం.

\- రాజశేఖర్‌రెడ్డి, ఐబీ ఏఈ, కట్టంగూరు

బీసీ రిజర్వేషన్ల కోసం
ఐక్యంగా ఉద్యమించాలి



చిట్యాలలో జరిగిన ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు నగేష్

చిట్యాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం రాజకీయాలకతీతంగా ఐక్యంగా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జిట్ట నగేష్, అవిశెట్టి శంకరయ్య కోరారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివారం చిట్యాలలో నిర్వహించిన ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ బిల్లును రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో తీర్మానం చేసి పంపినా కేంద్రం స్పందించడం లేదన్నారు. రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందకపోతే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు అన్యాయం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాని కోరారు. ఈ కార్యక్రమంలో జిట్ట సరోజ, మల్లం మహేష్, బొబ్బల సుధాకర్‌రెడ్డి, మెట్టు పరమేష్, ఐతరాజు యాదయ్య, గుడిసె లక్ష్మీనారాయణ, అక్కెనపల్లి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



ఉట్కూర్‌లో నూతన రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న కుర్ర లింగయ్య

శాలిగౌరారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నాయకుడు కుర్ర లింగయ్య అన్నారు. ఆదివారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నూతన రేషన్ కార్డుల లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు పాకాల సతీష్, కాంగ్రెస్ నాయకులు రంగు రాములు, కప్పల లింగయ్య, కుర్ర విద్యాసాగర్, కట్లకుంట్ల రమేష్, నాయకులు కప్పల వెంకన్న, కుర్ర సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

సినీ కార్మికుల డిమాండ్లను
పరిష్కరించాలి

చిట్యాల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): సినీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంట నే పరిష్కరించాలని సెంట్రల్ సెన్సార్‌బోర్డు మాజీ సభ్యుడు వనమా వెంకటేశ్వర్లు డి మాండ్ చేశారు. నిర్మాతల మండలి మొండి వైఖరి విడనాడాలని, వారం రోజులుగా కార్మికులు చేస్తున్న సమ్మెకు స్పందించి సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నల్లగొండ: మండలంలో కొత్త పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు ఈ నెల 13వ తేదీ వరకు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు దరఖాస్తు చేసుకోని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18-59 సంవత్సరాలలోపు గల అర్హులైన రైతులు రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, నామినీ ఆధార్‌కార్డు జీరాక్స్‌లను మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా కల్పించాలి

● చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మురళీధర్

గట్టుప్పల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా జియోట్యాగ్ కలిగిన చేనేత కార్మికులందరికీ చేనేత భరోసా కల్పించాలని చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన చేనేత కార్మిక సంఘం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. చేనేత కార్మికులు, సహకార సంఘాల దగ్గర నిల్వ ఉన్న వస్త్రాలను ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు కేంద్రాల తరహాలో కొనుగోలు చేయాలని కోరారు. చేనేత కార్మికులు, సహకార సంఘాల ద్వారా నేసిన వస్త్రాలు మార్కెట్ సౌకర్యం లేక నిల్వలు పేరుకపోయి ఉపాధి లేక నేసిన కూలీ గిట్టుబాటు కాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చేనేత సహకార సంఘాలు తీసుకున్న రుణాలను క్యాష్ క్రెడిట్ మాఫీ చేయాలని, చేనేత కార్మికులకు రుణం ఎంత ఉన్నా ప్రభుత్వం ఇస్తానన్నా లక్ష రూపాయలను ఎలాంటి షరతులు లేకుండా అమలుచేయాలని ఆయన అన్నారు. రుణ మాఫీ విషయంలో లక్ష రూపాయలకు పైగా రుణాలు ఉన్న ప్రభుత్వం మాఫీ చేస్తానని ఇంత వరకు మాఫీ చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అర్హత కలిగిన చేనేత కార్మికులకు ఇల్లు లేని పేదలకు 120 గజాల స్థలం ఇచ్చి కేంద్రం రూ.10లక్షలు, రాష్ట్ర ప్రభుత్వం 5లక్షలు ఇచ్చి హౌస్ కం వర్క్ షెడ్ నిర్మాణం చేయాలని ఆయన అన్నారు. ఈ మండల మహాసభలో పై తీర్మానాలను ఏకగ్రీవ తీర్మానం చేసి నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కర్నాటి వెంకటేశం అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో చేనేత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు కర్నాటి మల్లేశం, కందగట్ల గణేష్, భావండ్ల అంజనేయులు, చెరుపల్లి సత్యనారాయణ, పున్న కిషోర్, అందెం రాములు, చెరుపల్లి కృష్ణయ్య, మందుల శంకర్, కర్నాటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న చేనేత సంఘం నాయకులు

సేవా దృక్పథంతో వైద్యం అందించాలి

● మాజీ జడ్పీటీసీ నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్

కనగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): సేవా దృక్పథంతో వైద్యం అందించాలని మాజీ జడ్పీటీసీలు నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, చిట్ల వెంకన్నగౌడ్ కోరారు. కనగల్ ఎక్స్‌రోడ్డులో ఓ ఆస్పత్రిని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కనగల్‌తో పాటు చుట్టుపక్కల ఉన్న పల్లె జనాల కోసం అధునాతన సౌకర్యాలతో 24 గంటల వైద్యసేవలను అందించే ఆసుపత్రిని ఏర్పాటు చేయటం గొప్ప విషయమన్నారు. అయితే సామాన్య ప్రజలకు చౌకగా వైద్యం అందజేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింగ్ సునీతకృష్ణయ్యగౌడ్, నాయకులు హఫీజుద్దీన్, మురళీధర్‌గౌడ్, రాజు, డాక్టర్ ప్రదీప్‌కుమార్, ఆసుపత్రి నిర్వాహకుడు జితేందర్‌గౌడ్, సాయి పాల్గొన్నారు.

ప్రజా సమస్యల
పరిష్కారానికి పోరుకు సిద్ధం కావాలి

● సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం

నల్లగొండరూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా సమస్యలను విస్మరిస్తున్నాయని వాటిని పరిష్కరించేందుకు పోరుకు సిద్ధం కావాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎండీ సలీం పిలుపునిచ్చారు. పట్టణంలోని డాక్టర్స్ కాలనీలో ఏర్పాటు చేసిన సీపీఎం పట్టణ కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని అన్నారు. భావోద్వేగాలను రెచ్చగొడుతూ, విధ్వంస పాలన కొనసాగిస్తుందని అన్నారు. అధికారంలోకి రావడానికి అక్రమ పద్ధతిలో బీహార్ రాష్ట్రంలో దళిత, మైనార్టీల, ప్రతిపక్షాల ఓట్లను తొలగించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18నెలలు గడిచినా నేటికి ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలుచేయకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. ఇంటి స్థలం లేనివారికి ప్రభుత్వమే స్థలం కొనుగోలు చేసి ఇంటిని నిర్మించి ఇవ్వాలని, అర్హులైన వారికి ఆసరా పింఛన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. నల్లగొండ పట్టణంలో డ్రైనేజీ సమస్యలు ఉన్నాయని అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలుగ జేసుకొని వెంటనే పరిష్కరించాలని, లేనిచో సీపీఎం ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించే వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యురాలు తుమ్మల పద్మ అధ్యతన జరిగిన సమావేశంలో కృష్ణారెడ్డి, సర్దార్ అలి, లక్ష్మమ్మ, విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పంట పొలాల్లో రైతు నేస్తాల సందడి

● ఆహారం కోసం గుంపులుగా కొంగల విహారం

కనగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత వానాకాలం సీజన్ పంటల సాగు కోసం రైతులు తమ పంట భూముల్లో దుక్కులు దున్నుతున్నారు. దీంతో పక్షులకు ముఖ్యంగా కొంగలకు పండుగ వచ్చినట్లైంది. రైతులు ఎక్కడ పొలం దున్నితే అక్కడికి కొంగలు గుంపులుగుంపులుగా వచ్చి వాలుతున్నవి. పొలం దున్నేటప్పుడు మట్టిలోంచి బయటికి వచ్చే పురుగులను తింటూ కడుపు నిప్పుకుంటున్నాయి. ఈ క్రమంలో పంటలను నాశనం చేసే కీటకాలను అవి నిర్మూలిస్తూ రైతుకు పరోక్షంగా మేలు చేసి, రైతు నేస్తాలుగా గుర్తింపును పొందుతున్నాయి.

వ్యవసాయ భూముల్లో తెల్లటి విహంగాల వలె కొంగలు సంచరించటం చూడముచ్చటగా ఉందని పలువురు పేర్కొంటున్నారు.



దుక్కి దున్నుతున్న సమయంలో పొలంలో కొంగల సందడి

ఆపదలో ఉన్న కుటుంబానికి
అండగా ఉండటమే ఫౌండేషన్ లక్ష్యం



ఆర్థికసాయం అందజేస్తున్న ఫౌండేషన్ చైర్మన్ మెగారెడ్డి

మునుగోడురూరల్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గ్రామంలో ఆపదలో ఉన్న ప్రతీ కుటుంబానికి అండగా ఉండాలన్నదే వెదిరే పూలమ్మ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్ వెదిరే మెగారెడ్డి ఫౌండేషన్ సభ్యుడు వెదిరె విజేందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని కొంపల్లి గ్రామంలో ప్రభుత్వం ప్రతీ నిరుపేద కుటుంబానికి సొంతింటి కల నెరవేర్చాలని గొప్ప లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టకనేందుకు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న బోయపర్తి నర్సింగ్‌రావుకు రూ.20 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద ప్రజల సొంతింటి కల నెరవేర్చాలని గొప్ప లక్ష్యంతో ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులు ఆలస్యం చేయకుండా నిర్మాణాన్ని పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు జీడిమడ్ల నరసింహ, బోయపర్తి లింగయ్య, జీడిమడ్ల వెంకటయ్య, జడీమడ్ల నరసింహ, బోయపర్తి సంజీవ, జీడిమడ్ల సైదులు తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు
నోట్‌బుక్స్ టై, బెల్టుల పంపిణీ



నోటు బుక్స్‌తో పాఠశాల విద్యార్థులు

కనగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేగట్టె ప్రాథమిక పాఠశాలలో ఆదివారం గ్రామానికి చెందిన వేముల చంద్రమౌళి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.50వేల విలువైన నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, టై బెల్టులను విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా చంద్రమౌళి సతీమణి మంగతాయమ్మ మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల అభివృద్ధి కోసం ప్రతిఏటా తమ వంతు సాయంగా పలు సేవా కార్యక్రమాలను చేపడుతున్నామని వివరించారు. పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేయటం ప్రశంసనీయమని పాఠశాల హెచ్‌ఎం మహ్మద్ జాన్‌ఖాన్ కొనియాడారు. కార్యక్రమంలో దాతలు వేముల ప్రకాష్, గీతాంజలి, గిరిజ అమ్మ ఫౌండేషన్ చైర్మన్ ఎర్రోల సురేష్, సభ్యులు శ్రీను, సైదులు, జానీ, బిక్షపతి, వెంకన్న, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మాన్యం ఉన్నా ఆదరణ కరువు

● పూజలు నోచుకోని ఆంజనేయస్వామి
● ఐదేళ్లుగా ఎన్.కొత్తపల్లి ఆలయానికి తాళం
● అన్యాక్రాంతమవుతున్న దేవాలయ భూములు
● పట్టించుకోని అధికారులు

శాలిగౌరారం, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం నూలగడ్డ కొత్తపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం నిరాదరణకు గురైంది. పదేళ్ల నుంచి ఈ ఆలయంలో ధూప దీప నైవేద్యాలు లేక ఆలయానికి భక్తులు రాకపోవడంతో లేక వెలవెలబోతుంది. ఈ దేవాలయ పరిధిలో 12 ఎకరాల భూమి ఉన్నా నిరుపయోగంగా ఉండటంతో అన్యాక్రాంతమవుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. కొందరు ఈ ఆలయ ప్రాంగణంలో దైవ పూజలు కాకుండా ఇతర పూజలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఐదేళ్లుగా గుడికి తాళం.....

నూలగడ్డ కొత్తపల్లి ఆంజనేయస్వామి ఆలయంలో 5 ఏళ్ల నుంచి నిత్య పూజలు నిలిపి వేశారు. గతంలో దేవుని పేరు మీద ఉన్న భూ మిని సాగుచేసుకుంటూ గ్రామంలో ఉన్న పూజారులు నిత్య పూజలు చేసే వారు. ఐదేళ్ల నుంచి గ్రామంలోని పూజారులు పూజలు చేయడం నిలిపివేశారు. దేవాలయ భూములను కూడా సాగు చేయడం లేదు. అప్పటినుంచి గుడికి తాళం వేసే ఉంటుంది. ఆలయంలో నిత్య పూజలు నిర్వహించాలని ఎండోమెంట్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో పండుగలు, ఉత్సవాలు జరిగినపుడు కూడా ఆలయం మూసే ఉంటుంది.



నూలగడ్డ కొత్తపల్లిలోని ఆంజనేయస్వామి ఆలయం

నిత్యం పూజలు జరిపించాలి




గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం పూర్తి గా నిరాదరణకు గురైయింది. గతంలో ధూపదీప నైవేద్యాలతో భక్తుల సందడిగా ఉన్న ఈ ఆలయం గ్రామ పూజారులు, ఎండోమెంట్ అధికారుల నిర్లక్ష్యం వల్ల నిత్య పూజలు చేయడం లేదు. ఐదేళ్లుగా ఆలయానికి తాళం వేసి ఉండటం వల్ల భక్తులు పూజలకు దూరంగా ఉంటున్నారు. ఆలయం మూ సి ఉన్నందున గ్రామంలో అరిష్టాలు జరుగుతున్నాయి. వెంటనే ఎండోమెంట్ అధికారులు దేవాలయ భూములను దేవస్థానం పేరున మార్చి, ఆలయంలో ధూపదీప నైవేద్యాలతో పాటు నిత్యపూజలు చయడానికి పూజారులను నియమించాలి.

\- సిరిపంగి రాములు, మాజీ సర్పంచ్, నూలగడ్డ కొత్తపల్లి

ఆంధ్రజ్యోతి

గరిష్ఠం 30.0
కనిష్ఠం 23.0

ANDHRAJYOTHY



నల్లగొండ

5

సోమవారం 11 ఆగస్టు 2025

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	590 (312.0450)	65,842	1,09,871
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.33 (4.02)	4,365	4,365
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	172.963 (42.6707)	76,373	1,12,536

చికెన్ ధరలు	లైవ్ : రూ.117	డ్రెస్ : రూ.170	స్కిన్‌లెస్ : రూ.196

బోనమెత్తిన జిల్లా



జిల్లావ్యాప్తంగా బోనాల వేడుకలు వైభవంగా నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన బోనాలను మహిళలు ఊరేగింపుగా తీసుకెళ్లి, గ్రామదేవతలకు నైవేద్య సమర్పించారు.

రద్దీగా మారిన హైవే



వరుస సెలవులు ముగియడంతో తిరుగు ప్రయాణంలో 65వ నెంబర్ జాతీయ రహదారి పై రద్దీ కొనసాగింది. వాహనాలు బారులు తీరడంతో పలుచోట్ల ట్రాఫిక్ జామ్ అయింది.

భక్తజన సంద్రం..



ప్రధాన ఆలయంలో భక్తుల రద్దీ, (ఇన్‌సెట్‌లో) స్వామివారికి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరీశుడి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. దేవదేవుడిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులతో ఆలయ క్యూలైన్లు రద్దీగా కనిపించాయి.

మిగిలింది 4రోజులే

- 'భూభారతి' దరఖాస్తుల పరిష్కారానికి సమీపిస్తున్న గడువు
- వేలల్లో దరఖాస్తులుండగా పరిష్కారమైంది వందల్లోనే
- చిక్కుముడులున్న అర్జీలే ఎక్కువగా ఉండటంతో ముందుకు కదలని ఫైళ్లు
- క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఆటంకాలు
- నల్లగొండ జిల్లాలో గడువునాటికి సగం పూర్తి కూడా కష్టమే
- సాదాబైనామాలు, పీవోటీలు, కోర్టు కేసుల వల్లే పెండింగ్



భూభారతి దరఖాస్తులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి (ఫైల్)

జిల్లా	దరఖాస్తులు
నల్లగొండ	43636
యాదాద్రి	14,328
సూర్యాపేట	44,741
మొత్తం	1,02,705

భూముల చిక్కులన్నీ పరిష్కరించే నిమిత్తం ప్రభుత్వం తీసుకువచ్చిన 'భూభారతి' అమలుకు క్షేత్రస్థాయిలో అవాంతరాలు ఎదురవుతున్నాయి. గ్రామాలవారీగా నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఈ నెల 15లోగా వంద శాతం పరిష్కరించాలనే లక్ష్యం నెరవేరేలా కనిపించడం లేదు. జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన 'భూభారతి' సదస్సుల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రతీ రెవెన్యూ గ్రామం నుంచి భూ సమస్యలపై అర్జీలు వచ్చాయి. వీటన్నింటినీ క్రోడీకరించిన రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిష్కరించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నా ఇంకా వేల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో నిర్ణీత గడువులోగా దరఖాస్తులన్నీ పరిష్కరించడం అసాధ్యంగా కనిపిస్తోందని రెవెన్యూ ఉద్యోగులు, అధికారులు అభిప్రాయపడుతున్నారు.

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, నల్లగొండ

భూభారతి అమలులో భాగంగా ఉమ్మడి జిల్లాలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో భారీగా దరఖాస్తులు వచ్చాయి. మొత్తం 1,02,705 దరఖాస్తులు రాగా, వాటి ప్రకారం డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐ, ఇతర రెవెన్యూ సిబ్బంది గ్రామాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. అంతేగాక భూములను సందర్శించి అవసరమైన చోట్ల హద్దురాళ్లు నిర్ణయించడంతోపాటు అక్కడికక్కడే మ్యాప్‌లు రూపొందిస్తున్నారు.

ప్రధానంగా కుటుంబ వివాదాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లు, కబ్జా భూముల సమస్యలు, రికార్డుల్లో ఒకరి పేరుంటే, మోకాపై మరొకరు ఉండడం, రికార్డుల్లో పేర్లు తారుమారు, బై నెంబర్లు లేకపోవడం, అసైన్డ్ పట్టాలున్న సర్వేనెంబర్లలో డూప్లికేషన్ పెద్ద సంఖ్యలో ఉండడం, అటవీభూముల్లోనూ రెవెన్యూ భూములున్నాయని రైతులు చెబుతుండగా, వాటిని అటవీ భూములుగా ఆ శాఖ అధికారులు రికార్డులు సమర్పిస్తుండడం వంటి సమస్యలు క్షేత్రస్థాయి సర్వేల్లో వెలుగులోకి వస్తున్నాయి. వీటితో పాటు ప్రధానంగా పీవోటీలు, సాదాబైనామాలు, మిస్సింగ్ సర్వే నెంబర్లపై ఎటూ తేల్చలేని పరిస్థితి క్షేత్రస్థాయిలో అధికారులు ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది దరఖాస్తులు ఇంకా పెండింగ్‌లో ఉండగా, గడువు తరుముకొస్తుండడంతో ఈలోగా వందశాతం దరఖాస్తుల పరిశీలన పూర్తికా

మిగతా 7వ పేజీలో...

సాదాబైనామాలపై ఆశలు

పంద్రాగస్టు సందర్భంగానైనా సాదాబైనామాల రిజిస్ట్రేషన్లకు ప్రభుత్వం అనుమతి ఇస్తుందనే ఆశాభావం రైతుల్లో నెలకొంది. ఉమ్మడి జిల్లాలో దశాబ్దాల కాలంగా పెద్ద సంఖ్యలో సాదాబైనామా క్రయవిక్రయాలు కొనసాగాయి. గత ప్రభుత్వ హయాంలో 2014కు ముందు ఉన్న సాదాబైనామాలన్నింటికీ మోక్షం కల్పించాలని నిర్ణయించి 2020 అక్టోబరు 12 నుంచి నవంబరు 10వ తేదీ వరకు అందుకు గడువు ఇచ్చారు. ఈ నిర్ణీత వ్యవధిలో మీ-సేవా కేంద్రాల్లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వం పేర్కొనడంతో పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ధరణి పోర్టల్ అమలులోకి వచ్చాక సాదాబైనామాల ప్రస్తావన లేకపోవడంతో ఆ దరఖాస్తులన్నీ మూలనపడ్డాయి. తాజాగా భూభారతిలో సెక్షన్-6 ప్రకారం 2020లో మీ-సేవా కేంద్రాల ద్వారా వచ్చిన దరఖాస్తులనే పరిగణనలోకి తీసుకోవాలని నిర్ణయించడంతో, ఆతర్వాత లావాదేవీలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకొని 2023 వరకు ఉన్న సాదాబైనామాలకు అనుమతించాలని రైతులు కోరుతున్నారు. అయితే ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో మాత్రం సాదాబైనామాలకు సంబంధించి ఉమ్మడి జిల్లాలో ఇప్పటివరకు పెండింగ్ ఉన్న భూయజమానులంతా తిరిగి కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. నల్లగొండ జిల్లాలో 6,793 దరఖాస్తులు రాగా, యాదాద్రి జిల్లాలో 3,458, సూర్యాపేట జిల్లాలో అత్యధికంగా 15,678 దరఖాస్తులు వచ్చాయి. మొత్తం దరఖాస్తుల్లో సాదాబైనామాలవే సింహభాగం ఉండగా, సాదాబైనామా రిజిస్ట్రేషన్లు చేయాల్సిన ఆవశ్యకతను తెలుపుతోంది. అయితే సాదాబైనామాలపై హైకోర్టులోనూ కేసు పెండింగ్‌లో ఉండడంతో ఆ తీర్పు వచ్చేంతవరకు వేచి ఉండి దానికి అనుగుణంగా రిజిస్ట్రేషన్లపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని, అప్పటివరకు వేచి ఉండక తప్పదని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు

పొడిగింపేనా?




- 14తో ముగుస్తున్న పాలకవర్గాల పదవీ కాలం
- పీఏసీఎస్‌లకు ఇప్పట్లో ఎన్నికల నిర్వహణ అసాధ్యమే!
- రెండు, మూడు రోజుల్లో స్పష్టత ఇవ్వనున్న ప్రభుత్వం

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)తో పాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు(డీసీసీబీ) పాలకవర్గం గడువు ఈనెల 14తో ముగియనుంది. ఈ నేపథ్యంలో స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తారా? లేక మరోసారి పాలకవర్గాల గడువును పొడగిస్తారా? అని చర్చ కొనసాగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారంలో పీఏసీఎస్‌లతోపాటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు పాలకవర్గం గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలల పాటు పాలకవర్గాల గడువును పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ గడువు సైతం ఈ నెల 14వ తేదీతో ముగియనుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో మొత్తం 108 సహకార సంఘాలు ఉన్నాయి. ప్రాథమిక సహకార సంఘాల గడువు ముగుస్తున్న నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉమ్మడి జిల్లాల డీసీసీబీ చైర్మన్లు, రాష్ట్ర టెస్కాబ్ పాలకవర్గం సైతం ఇప్పటికే మంత్రులను కలిసి గడువు పొడిగించాలని కోరినట్లు తెలిసింది. అంతేగాక దీనిపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్లు కలిసేందుకు నిర్ణయించారు. సీఎం సమయం కేటాయిస్తే ఆయన్ను కలిసి గడువు పొడిగింపుపై వినతి పత్రం సమర్పించనున్నారు. ఆరు నెలల క్రితం పీఏసీఎస్‌లు, డీసీసీబీ పాలకవర్గాల గడువు ముగియక ముందే సీఎం రేవంత్‌రెడ్డిని డీసీసీబీ చైర్మన్లు కలిశారు. సొసైటీలు, సహకార బ్యాంకుల అభివృద్ధి కోసం మరికొంత

మిగతా 7వ పేజీలో...

- మళ్లీ తెరుచుకున్న సాగర్ క్రస్ట్‌గేట్లు



నాగార్జునసాగర్ ప్రాజెక్టు గరిష్ఠ నీటిమట్టానికి చేరుకుంది. ఎగువ నుంచి వరద కొనసాగుతుండటంతో ఆదివారం ఎనిమిది క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. ఈ సీజన్‌లో క్రస్ట్‌గేట్లను ఎత్తడం ఇది రెండోసారి.

• 7లో

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ప్రధానాస్పత్రిలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ఆదివారం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రిని ఆమె తనిఖీ చేశారు. క్యాజువాలిటీ, ఐసీయూ, ఏఎంసీయూ, సర్జికల్, మెడికల్ వార్డులు, రేడియాలజీ, తదితర విభాగాలను తనిఖీ చేసి వైద్యులు, నర్సులతో మాట్లాడారు. ఆస్పత్రి ద్వారా అందిస్తున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఎంత మంది రోగులు ఉన్నారు. ఎన్ని పడకలు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధులతో ఆస్పత్రికి వస్తున్న వారి వివరాలపై ఆరా తీశారు. రేడియాలజీ విభాగం దూరంగా ఉన్నందున నడవలేని రోగులకు మొబైల్ ఎక్స్‌రే యూనిట్ ద్వారా ఎక్స్‌రే తీయిస్తున్నామని, నడవగలిగే వారిని వీల్ చైర్ ద్వారా రేడియాలజీ విభాగాని తీసుకెళ్తున్నామని వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పతిరలో అవసరమైన అన్ని వైద్య పరికరాలు, సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులతో ఎక్కువ మంది ఆస్పత్రికి వస్తున్నారని, వారికి తగిన వైద్య చికిత్సలు అందించాలన్నారు. మందులు ఇతర ఏ సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. వైద్య పరీక్షల నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యం, ఇబ్బంది లేకుండా రోగులకు అవసరమైన అన్ని పరీక్షలు చేయాలన్నారు. ఆమె వెంట డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్‌వర్మ, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఈశ్వర్, ఆర్ఎంవో కిరణ్ కుమార్, టీఎస్ఎంఐడీసీ రాజశేఖర్, జితేందర్, తదితరులు ఉన్నారు.



జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నులిపేద్దాం

నేడు జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం



చిన్నారులు ఎదిగేందుకు అడ్డుపడుతున్న నులిపురుగుల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా నేటి నుంచి ఈ నెల 18వ తేదీ వరకు ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసింది.

7

ఆదిపరాశక్తిగా.. ఎల్లమ్మ తల్లి



పూజల్లో పాల్గొన్న భక్తులు, (ఇన్‌సెట్‌లో) ఆదిపరాశక్తి అలంకారంలో అమ్మవారు

కనగల్, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్వేశిపురం స్టేజీవద్దగల రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారు శ్రావణ మాసం మూడో ఆదివారం పురస్కరించుకుని భక్తులకు ఆదిపరాశక్తిగా దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు మల్లాచారి, శ్రవణాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేసి లక్ష్మీ అష్టోత్తర విశేష పూజలు నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులిచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసారు. కాగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు ఆలయ ప్రదక్షిణలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించారు. చీరు, సారె, ఒడిబియ్యం, నైవేధ్యాలను భక్తిశ్రద్ధలతో సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిక్కిరిసాయి. భక్తుల రద్దీకి అనుగుణంగా చైర్మన్ చీదేటి వెంకట్‌రెడ్డి, ఈవో అంబటి నాగిరెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఏర్పాట్లు చేశారు.

దోస్త్ స్పాట్ అడ్మిషన్లల్లో అనుమతి ఇవ్వాలి

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): దోస్త్ స్పాట్ అడ్మిషన్లల్లో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలకు అనుమతి ఇవ్వాలని ప్రభుత్వ కళాశాలల గెజిటెడ్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.గోపి, కడారు సురేందర్‌రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ సుంకరి రాజారాం ఒక ప్రకటనలో కోరారు. డిగ్రీ పథమ సంవత్సరంలో అడ్మిషన్లు పొందే వారికి ఇప్పటివరకు మూడు విడతలలో దోస్త్ ద్వారా పూర్తి చేశారని తెలిపారు. ప్రత్యేక విడత ముగిసే దశలో ఉందన్నారు. అయితే ఉన్నత విద్యామండలి ఇచ్చిన ఉత్తర్వుల్లో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగే స్పాట్ అడ్మిషన్లకు ప్రైవేట్ కళాశాలలకు మాత్రమే అనుమతి ఇచ్చారన్నారు. వృత్తిరీత్యా ప్రైవేట్, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగంలో పనిచేసే వారు, వివిధ కారణాలతో ఇత రాష్ట్రాల్లో పనిచేసే కుటుంబాల పిల్లలు, ఆయా రాష్ట్రాల్లో చదివినందున వారిని నాన్ లోకల్‌గా పరిగణించి దోస్త్ అడ్మిషన్ ప్రక్రియలో అనుమతించడం లేదన్నారు. ప్రతీ విద్యార్థికి డిగ్రీ కళాశాలలో చదువుకునే అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వ కళాశాలలో మిగిలిపోయిన సీట్లు ఉన్న కళాశాలలో బయటి రాష్ట్రాల్లో చదువుకున్న విద్యార్థులకు ఈ స్పాట్ అడ్మిషన్ల ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అనుమతించాలని తెలిపారు.

రేపు జిల్లాలో రేజాంగ్ల రజ్ కలశ యాత్ర

నల్లగొండ, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 12వ తేదీన రేజాంగ్ల రజ్ కలశ యాత్రను నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర కార్యదర్శి లోడంగి గోవర్ధన్ ఒక ప్రకటనలో తెలిపారు. 1962 సంవత్సరంలో రేజాంగ్ల అనే ప్రాంతంలో ఇండియా, చైనాల మధ్య జరిగిన యుద్ధంలో 1300 మందిని హతమార్చారన్నారు. 120 మంది యాదవ యుద్ధవీరులు వీరమరణం పొందారని, ఈ వీరులకు గుర్తింపుగా యాదవ రెజిమెంట్ ప్రకటించాలని అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యంలో ఈ రేజాంగ్ల రజ్ కలశ యాత్రను నిర్వహిస్తున్నామని తెలిపారు. 12వ తేదీన ఉదయం 10 గంటలకు దేవరకొండ, మధ్యాహ్నం 12గంటలకు కొండమల్లేపల్లి, ఒంటిగంటకు గుర్రంపోడు, 2 గంటలకు కనగల్, మధ్యాహ్నం 3గంటలకు జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలన్నారు.

గుట్ట ఆలయ భద్రతకు పెద్దపీట

- దేవాదాయ కమిషనర్, ఆలయ ఈవో ఎస్.వెంకట్రావ్



7

దేవరకొండలో ముసురుతో కూడిన వర్షం

దేవరకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండలో ఆదివారం సాయంత్రం ముసురుతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో పలు కాలనీల రోడ్లు వర్షపునీరు చేరి గుంతలమయమయ్యాయి. వర్షానికి దేవరకొండ పట్టణంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో పట్టణ ప్రజలతో పాటు రైతులు కొంత ఊరట చెందుతున్నారు. రెవెన్యూశాఖ ఆధ్వర్యంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు.

కాంగ్రెస్‌తోనే ప్రగతి సాధ్యం: నాగభూషణ్

చింతపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అన్ని రంగాల్లో ప్రగతి సాధిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ అన్నారు. చింతపల్లి మండలంలోని నెల్వలపల్లిలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి ఎమ్మెల్యే బాలునాయక్ చేస్తున్న కృషి అమోఘమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఆరున్నరేళ్ల తర్వాత ఎన్నికలు

- హోరాహోరీగా మెడికల్ కెమిస్ట్ అసోసియేషన్ ఎన్నికలు
- ఈ నెల 13న ఎన్నికలు
- రెండు ప్యానళ్లుగా విడిపోయిన కెమిస్టులు

మిర్యాలగూడ అర్బన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వైద్య రంగంలో పేరుగాంచిన మిర్యాలగూడలో మెడికల్ కెమిస్ట్ అసోసియేషన్ ఎన్నికలకు సమయం ఆసన్నమైంది. ఆరున్నరేళ్ల తర్వాత అసోసియేషన్ ఎన్నికలు తెరమీదకు రావడంతో అధ్యక్ష పదవి దక్కించుకునేందుకు ఔత్సాహికులు సన్నద్ధమయ్యారు. పట్టణంలో దాదాపు 3 వందల వరకు కెమిస్ట్ అండ్ డ్రగ్స్ దుకాణాలు ఉండగా, అందులో 2 వందల షాపుల నిర్వాహకులు యూనియన్‌లో సభ్యులుగా కొనసాగుతున్నారు. గతంలో యూనియన్ పర్యవేక్షణలో నడుచుకున్న మెడికల్ వ్యాపారులు కొన్ని అనివార్య కారణాలతో ఎవరికి వారుగా విడిపోయారు. దీంతో యూనియన్ ప్రాబల్యం సన్నగిల్లింది. దీంతో కొందరు వ్యక్తులు తమ ఆధిపత్యాన్ని చెలాయిస్తున్న నేపథ్యంలో యూనియన్ బలోపేతానికి వ్యాపారులు నడుం బిగించిన నేపథ్యంలో ఎన్నిక తప్పనిసరైన నేపథ్యంలో పట్టణంలోని మెడికల్ వ్యాపారులు రెండు వర్గాలుగా విడిపోయారు. దీంతో రెండు ప్యానల్ సభ్యులు పోటాపోటీగా ఎన్నికల్లో పాల్గొనేందుకు కసరత్తులు మొదలుపెట్టి నామినేషన్ల ప్రక్రియ సైతం ముగించి ఈ నెల 13వ తేదీన ఎన్నికలకు సిద్ధమయ్యారు. మిర్యాలగూడ కెమిస్టుల అధ్యక్ష, కార్యదర్శుల పదవుల కోసం ఒక ప్యానల్ నుంచి కొంపల్లి గోవర్ధన్, కర్నాటి శ్రీధర్‌లు పోటీపడుతుండగా, మరో ప్యానల్ నుంచి పాలపర్తి కృష్ణారెడ్డి, గొల్లగోపు సాయియాదవ్ బరిలో నిలిచారు. ఎన్నికల్లో తమ ప్యానల్ అభ్యర్థులను గెలిపించుకునేందుకు డ్రగ్ అండ్ కెమిస్టు వ్యాపారులు బ్యాలెట్ పత్రాలను ముద్రించి ప్రచారం ముమ్మరం చేశారు. అయితే ఈ రెండు వర్గాల్లో పోటీపడుతున్న అభ్యర్థులను కెమిస్టులు పరిశీలించి ఓటింగ్ సరళిలో పాల్గొనేందుకు సిద్ధపడుతున్న లబ్యర్థులు తమదైన శైలిలో ప్రచారాన్ని ముమ్మరం చేసి పోటాపోటీగా విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్న క్రమంలో ఎన్నికల సందడి కోలాహలంగా మారింది.



ఎన్నికల ప్రచార కరపత్రాలు



డ్రగ్ అండ్ కెమిస్ట్‌లు ముద్రించిన ఎన్నికల ప్రచార కరపత్రం

బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలి



మిర్యాలగూడ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న సీపీఎం నాయకులు

వేములపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అందేలా కేంద్రం వెంటనే చర్యలు చేపట్టాలని మాజీ వైస్ ఎంపీపీ పాదూరి గోవర్ధని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని సల్కునూరు క్రాస్‌రోడ్డు వద్ద ఆదివారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచి బీసీలకు రానున్న ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ ప్రకారం సీట్లు కల్పించాలని ఆమె కోరారు. ఆ దిశగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చి కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేసేలా చర్యలు చేపట్టాలని ఆమె అన్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం బీసీల పట్ల వివక్షతను వీడాలని, తక్షణమే బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్‌లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు చిరుమల్ల బిక్షం, ఎలగబోయిన లింగయ్య, రాంభద్రు, ఎల్లయ్య, నాగయ్య, నాగయ్య, జాని తదితరులు పాల్గొన్నారు.

బీసీ బిల్లు అమలు చేయాలని ధర్నా

మిర్యాలగూడ అర్బన్: బీసీలకు 42శాతం రిజర్వేషన్ బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆది వారం స్థానిక అంబేడ్కర్ విగ్రం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు డబ్బీకార్ మల్లేష్ మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక, సామాజిక, రాజకీయ ప్రయోజనాల దృష్ట్యా బీసీ రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీ ఆమోదించిందన్నారు. బిల్లును పరిశీలించి పార్లమెంటులో ఆమోదించే విషయంలో కీలకంగా వ్యవహరించాల్సిన కేంద్ర ప్రభుత్వం నీరుగార్చే ప్రయత్నం చేస్తుందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత బీసీ ప్రయోజనం దక్కడం లేదన్నారు. ముస్లిం, మైనార్టీల సాకుచూపి బిల్లును వ్యతిరేకించడం సరైందికాదన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ద్వంద్వవైఖరిని ఎండకట్టేందుకు అన్ని రాజకీయ పక్షాలు ఏకం కావాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించి ఎన్నికల సరళి కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు వీరేపల్లి వెంకటేశ్వర్లు, నాయకులు రవినాయక్, శశిధర్‌రెడ్డి, వినోద్‌నాయక్, గాదె పద్మ, అయూబ్, మల్లయ్య, సైదులు, గోవర్ధన, ఊర్మిల, కరీమున్నీసా, హుస్సేన్, లక్ష్మీనారాయణ, కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, రామారావు, వజీర్ పాల్గొన్నారు.


వేములపల్లిలో నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

ఘనంగా సీత్లా పండుగ


సీత్లా పండుగలో పూజల్లో పాల్గొన్న గిరిజనులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): గిరిజనులు ప్రతి ఏటా నిర్వహించే సీత్లా భవాని పండుగను కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని బంజారాభవన్‌లో ఆదివారం బంజారా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రజలు, పశుపక్ష్యాదులు ఆరోగ్యంగా ఉండాలని, పాడి పంటలు సమృద్ధిగా పండాలని, వర్షాలు కురవాలని గిరిజనులు సీత్లాభవానికి దూప దీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు జరిపారు. ఈ కార్యక్రమంలో బంజారా సంఘం కొండమల్లేపల్లి అధ్యక్షుడు రమావత్ లాలునాయక్, ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ సురేష్, ఎంఈవో నాగేశ్వర్‌రావు, బంజార సంఘం ఉద్యోగులు, బావోజీలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బోనాల పండుగకు ఏర్పాట్లు పూర్తి


సమావేశంలో మాట్లాడుతున్న ఉత్సవ సమితి సభ్యులు

మిర్యాలగూడటౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): బోనాల పండుగ ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తాళ్లగడ్డ మాజీ కౌన్సిలర్ బాసాని గిరి అలివేలు తెలిపారు. ఆదివారం ఆలయ సమీపంలో ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పట్టణంలోని పందిళ్లపల్లి చెరువుతీరాన కొలువుదీరిన ముత్యాలమ్మ తల్లికి ఈ నెల 14న బోనాలు సమర్పించేందుకు ఉత్సవ కమిటీ నిర్ణయించిందన్నారు. ఈ నేపథ్యంలో 1,2,3వ వార్డు ప్రజలు కట్టమీద ముత్యాలమ్మ తల్లి అమ్మవారికి గురువారం బోనాలు సమర్పించే ఏర్పాట్లు చేపుకోవాలన్నారు. సమావేశంలో కట్ట పుల్లయ్య, మూల రాజిరెడ్డి, సానుగోతు చత్రు నాయక్, చింతల శివ, రేఖ నాగయ్య, కునరెడ్డి నాగేందర్‌రెడ్డి, అంజి, ఉపేందర్, రాము, మహేష్, నాగ్ తదితరులు పాల్గొన్నారు.

చినుకు పడితే..చిత్తడే...

- బీటీ రహదారులన్నీ జలమయం
- వాహనదారులకు తప్పని తిప్పలు

చింతపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు బీటీ రహదారులు చిత్తడిమయంగా మారాయి. ప్రధానంగా చింతపల్లి మండలంలోని గొడకొండ్ల, వెంకటేశ్వరనగర్, ఎం. మల్లేపల్లి, పీ.కే.మల్లేపల్లి, కుర్మపల్లి, ఉమ్మాపురం, తిరుమలాపురం, వింజమూర్, తదితర గ్రామాల్లో బీటీ రహదారులు పూర్తిగా చిత్తడి మారాయి. దీంతో వాహనదారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మారిన, అధికారులు మారిన గ్రామాల్లోని బీటీ రహదారులకు పూర్తి స్థాయిలో మోక్షం కలగలేదు. నేటికి మట్టి రహదారులపై వెళ్తూ ఇబ్బందులకు గురవుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో గ్రామాల్లో పర్యటించి తారు రహదారులుగా మార్చేందుకు కృషి చేసి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


చిత్తడిమయంగా మారిన గొడకొండ్లకు వెళ్లే బీటీ రహదారి

మొక్కలు నాటి సంరక్షించాలి

- దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ


మొక్కలు నాటుతున్న స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ

దేవరకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి వాటిని సంరక్షించాలని దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ అన్నారు. ఆదివారం స్పోర్ట్స్ అసోసియేషన్ భవనం, 10వ వార్డులో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలను పెంచడం వల్ల ఎన్నో ప్రయోజనాలు ఉంటాయని అన్నారు. ప్రతీ ఇంటికి మూడు మొక్కల చొప్పున నాటి వాటిని సంరక్షించాలని ఆయన కోరారు. స్పోర్ట్స్ అసోసియేషన్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 300 మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ సభ్యులు శ్రీధర్‌గౌడ్, పంతులాల్, భాస్కర్, భాస్కర్‌రెడ్డి, తాళ్ల సురేష్‌తో పాటు 10వ వార్డు కాలనీవాసులు పాల్గొన్నారు.

అంతర్గత రోడ్లను ఏర్పాటు చేయాలి

దేవరకొండ, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): దేవరకొండ పట్టణంలోని సంజయ్‌కాలనీ, 2వ వార్డు, గాంధీనగర్, హనుమాన్‌నగర్‌తోపాటు పలు కాలనీల రోడ్లకు నిధులు కేటాయించి పూర్తి చేయాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు వస్కుల సుధాకర్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వర్షాలు కురుస్తుండటంతో మునిసిపాలిటీ పరిధిలోని కాలనీల రోడ్లు గుంతలమయమై వర్షపునీరు చేరి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అన్నారు. నిధులు కేటాయించి రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆయన కోరారు.

విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచాలి

- మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్


వంటగదిని పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇస్తున్న మండల ప్రత్యేకాధికారి పత్యానాయక్

దామరచర్ల, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని గురుకుల పాఠశాలల్లో విద్యార్థుల హాజరుశాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా సహకార అధికారి పత్యానాయక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని తెలంగాణ గిరిజన గురుకుల బాలికల పాఠశాల, గిరిజన సంక్షేమ హాస్టళ్లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి స్టాక్ రిజిస్టర్లు, స్టోర్ రూమ్, వంటగదిని పరిశీలించి తాజా కూరగాయలు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలను మెనూ ప్రకారం విద్యార్థులకు అందించాలన్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు ప్రతీ రోజు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సిబ్బంది సమయపాలన పాటించేలా ప్రిన్సిపాల్ బాధ్యత తీసుకోవాలన్నారు. పాఠశాలలో అపరిశుభ్ర వాతావరణం కనపడితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహించబడే పాఠశాలలో విద్యార్థులకు సెలవులు ఇవ్వకూడదని వందశాతం హాజరు ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. హాస్టల్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని, అభ్యసన సామర్థ్యాలు పెంపొందేలా వార్డెన్లు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అరుగులే ఆధారం.. అధికారుల అలసత్వం

- పౌరసేవలందిచడంలో నిర్లక్ష్యం

మిర్యాలగూడ టౌన్, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): వినియోగదారులు దేవుళ్లంటారు వ్యాపారులు. ఓటర్లు దైవంతో సమానమంటారు రాజకీయనాయకులు. అయితే సేవలు పొందేందుకు వచ్చే పౌరులు మాకేమీ కాదంటున్నారు మునిసిపల్ ఉద్యోగులు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, గృహ నిర్మాణ అనుమతులు, వ్యాపార లైసెన్సులు, వృద్ధ, దివ్యాంగుల పింఛన్లు, పావలా వడ్డీ రుణాలు ఆస్తి, నీటి పన్ను చెల్లింపుల కోసం నిత్యం వందలాది మంది వస్తుంటారు మునిసిపల్ కార్యాలయానికి. అయితే ఆ సేవలు పొందేందుకు వచ్చే వారి కోసం కుర్చీ, టేబుల్ ఏర్పాటు చేయడం లేదు మునిసిపల్ అధికారులు. గ్రేడ్ తగ్గుతుందనో, ర్యాంకు పడిపోతుందనో, మరే కారణం చేతనో కానీ.. నిలువెత్తు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు పురపాలకులు. సేవలు పొందేందుకు కార్యాలయానికి వచ్చిన పౌరులు అక్కడి అరుగులపై లేదా కార్యాలయంలో పార్క్ చేసిన వాహనాలపై ఆధారపడి తమ దరఖాస్తులు నింపుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.


మునిసిపల్ కార్యాలయంలో అరుగులపై కూర్చున్న సీనియర్ సిటిజన్స్


మునిసిపల్ కార్యాలయంలో అరుగులపై కూర్చుని దరఖాస్తు నింపుతున్న పౌరులు

ద్వితీయ మహాసభను విజయవంతం చేయాలి

చింతపల్లి, ఆగస్టు 10 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మిక సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 11వ తేదీన వెంకటేశ్వరనగర్(మాల్)లో నిర్వహించే ద్వితీయ మహాసభను విజయవంతం చేయాలని కార్యవర్గ సభ్యుడు చేపూరి ధనుంజయ్య తెలిపారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమానికి వెంకటేశ్వరనగర్(మాల్)కు చెందిన గుర్రం చంద్రమౌళి సహకారంతో ద్వితీయ మహాసభను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నర్సింహారెడ్డి, చేనేత కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకటరాములు హాజరవుతున్నట్లు తెలిపారు. చేనేత కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

రైతు బీమా రైతు కుటుంబానికి ధీమా

నేరేడుగొమ్ము, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): నేరేడుగొమ్ము మండలంలో నూతనంగా పట్టాదారు పాస్‌పుస్తకాలు పొందిన రైతులంతా 2025-26 సంవత్సరానికి సంబంధించి రైతు బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి యాదగిరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతుబీమా సైట్ ప్రారంభమైందని, ఈ నెల 5వ తేదీ వరకు పాస్‌పుస్తకాలు పొందిన రైతులందరూ అర్హులేనని పేర్కొన్నారు. రైతుబీమా పథకానికి దరఖాస్తులు చేసుకునే రైతులు ధ్రువీకరణ పత్రాలు పట్టాదారు పాస్‌పుస్తకం జీరాక్స్, ఆధార్‌కార్డు జీరాక్స్, నామిని ఆధార్‌కార్డు జీరాక్స్ జతచేసి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. వివరాల కోసం మండల వ్యవసాయ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. ఈ నెల 13వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పెద్దవూర: మండలంలో కొత్త పట్టా పాస్ బుక్ వచ్చిన రైతులు ఈ నెల 13వ తేదీ వరకు రైతు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో సందీప్‌కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంతకుముందు దరఖాస్తు చేసుకోని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలన్నారు. 18-59 సంవత్సరాలలోపు గల అర్హులైన రైతులు రైతుబీమా దరఖాస్తు ఫారంతో పాటు ఆధార్ కార్డు, పట్టాదారు పాస్ పుస్తకం, నామినీ ఆధార్‌కార్డు జీరాక్స్‌లను మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందించాలన్నారు.

వైభవంగా గ్రామదేవతలకు బోనాలు


వేముపల్లిలో అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న మహిళలు

వేములపల్లి, ఆగస్టు 10(ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములపల్లి గ్రామంలో ఆదివారం ఊర బోనాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యువసత్తుల విన్యాసాలు, డప్పు వాయిద్యాలతో గ్రామంలోని పలు గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మహిళలు అనంతరం ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకొని బోనాలు, నూతన వస్త్రాలను సమర్పించి పాడిపంటలతో, ఆయురారోగ్యాలతో ఉండేలా తమను చల్లంగా చూడాలని భక్తులు తమ మొక్కులను చెల్లించుకున్నారు. కార్యక్రమంలో జడరాములుయాదవ్, నాగవెల్లి మధు, చిర్రమల్లయ్యయాదవ్, పుట్టల శ్రీనివాస్, నాగవెల్లి శంకర్, మహిళలు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.


వావిల్‌కోల్‌లో ఈదమ్మ బోనాలతో వెళ్తున్న భక్తులు

వావిల్‌కోల్‌లో ఈదమ్మ బోనాలు

డిండి: డిండి మండలంలోని వావిల్‌కోల్ గ్రామంలో ఆదివారం ఈదమ్మ బోనాల జాతర నిర్వహించారు. భక్తులు బోనం కుండలతో వచ్చి ఈదమ్మదేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పేర్వాల సుధాకర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, కొండల్‌రెడ్డి, బుచ్చయ్య యాదవ్, మల్లయ్యయాదవ్, గుడూరు తెల్లయ్యయాదవ్ పాల్గొన్నారు.